
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
www.andhrajyothy.com
కామారెడ్డి
20
శుక్రవారం 4 ఆగస్టు 2017



నేడు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అంత్యక్రియలు



- కామారెడ్డి మొట్ట మొదటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మృతి
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్న ప్రభుత్వం
- ఆయన స్వస్థలంలోనే అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు
- విఠల్‌రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్
- రెండు నిమిషాలు మౌనం పాటించిన బార్ అసోసియేషన్ సభ్యులు

9

నలిగిపోతున్న.. పోలీస్







ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- సిబ్బంది లేక పోలీసుల ఇబ్బంది
- జనాభాకు అనుగుణంగా జరగని నియామకం
- అదనపు బాధ్యతలతో ఖాకీల అవస్థలు
- రాజకీయ ఒత్తిళ్లతో సతమతం

కనిపించే మూడు సింహాలు నీతి, న్యాయం, ధర్మానికి ప్రతి రూపాలైతే.. కనిపించని నాలుగో సింహమే పోలీసు. కానీ విధి నిర్వహణలో అదనపు బాధ్యతలు, రాజకీయ ఒత్తిళ్లతో ఆ నాలుగో సింహం నలిగిపోతోంది. శాంతి భద్రతల పరిరక్షణ.. అక్రమ దందాల నిర్మూలన.. సరిపడా సిబ్బంది లేక అదనపు బాధ్యతలు.. జనాభాకు అనుగుణంగా జరగని నియామకాలు, రాజకీయ ఒత్తిళ్లు వెరసి పోలీసులు సతమతం అవుతున్నారు. శాంతి భద్రత పరిరక్షణతో పాటు అక్రమ అక్రమ దందాలు, వ్యాపారాలు అరికట్టాలని, అక్రమాలకు పాల్పడే వారిని ఎవరినీ వదిలి పెట్టవద్దని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ఏ మాత్రం ఏమరుపాటు వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎంతటి వారినైనా వదిలి పెట్టకుండా కేసుల నమోదుకు వెనుకాడడం లేదు. కానీ జిల్లాలో సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

8

హరితహారంలో..

కామారెడ్డి ద్వితీయ స్థానం



పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మొక్కలు నాటుతున్న మంత్రి పోచారం

- రాష్ట్రంలో హరితహారంలో ఉమ్మడి జిల్లా నిజామాబాద్ ప్రథమ స్థానం
- రాష్ట్రంలో 18కోట్ల 16లక్షలు నాటడమే లక్ష్యం
- అడవులు దట్టంగా ఉన్న చోటనే విపరీతంగా వర్షాలు కురుస్తాయి
- ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి.. వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలి
- కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌కు సాగు నీరు అందిస్తాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

20

అధికారుల వేధింపులు..

ఏకపక్ష విధానాలు!



- ఆందోళన బాట పట్టిన జిల్లా ఆర్టీసీ కార్మికులు
- కనీస వేతనాలు ఇవ్వకుండా అదనంగా పని భారం
- డీఎం, అసిస్టెంట్ డీఎం ఒకే యూనియన్‌కు వంతపాడుతున్నారని ఆరోపణలు
- అలాంటిదేమీ లేదన్న డీఎం

వివరాలు 8లో..

అధికారుల ఏకపక్ష విధానాలు, ఒకే యూనియన్‌కు వంతపాడుతూ.. మిగతా యూనియన్ల వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని కామారెడ్డి ఆర్టీసీ డిపోలోని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా అదనపు పని భారాన్ని మోపుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. వంతపాడుతున్న అధికారుల తీరును నిరసిస్తూ ఈ నెల 1 నుంచి కామారెడ్డి ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- 'ఆంధ్రజ్యోతి'తో ఎల్లారెడ్డి సీఐ సుధాకర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎవరూ డ్రగ్స్ జోలికి వెళ్లి తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, విద్యార్థులపై వారి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉన్నతస్థానానికి ఎదగాలని ఎల్లారెడ్డి సీఐ సుధాకర్ అన్నారు. ఎల్లారెడ్డి సర్కిల్‌లో డ్రగ్స్ నివారణకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారిలా..



ఆంధ్రజ్యోతి: ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో ఎన్ని పోలీసు స్టేషన్లు ఉన్నాయి ?

సీఐ: ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి స్టేషన్లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో క్రైం రేట్ తగ్గిందా?

సీఐ: ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం క్రైం రేట్ తగ్గింది.

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్ బారిన పడకుండా యువతకు, కళాశాలల విద్యార్థులకు ఎలాంటి సూచనలు అందిస్తున్నారు ?

సీఐ: మత్తుకు బానిసై యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఇటీవల కళాశాలల్లోని విద్యా ర్థులకు యాంటిడ్రగ్స్ అనే కార్యక్రమాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్‌తో వచ్చే అనర్థాలపై యువతకు ఎలాంటి సందేశాన్నిస్తారు ?

సీఐ: ఇటీవల కాలంలో కొంతమంది యువత డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. హెరాయిన్, గంజాయి, కొకైన్ వంటి భయంకరమైన మత్తు పదార్థాలకు అలవాటుపడి వాటికి బానిసగా మారుతున్నారు. డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్య సమస్యలతో పాటు జీవితం ఛిద్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేప డుతున్నాం. గ్రామస్థాయిలో పౌరులకు రోడ్డు ప్రమాద బారీన పడకుండా విలేజ్ పోలీస్ అధికారుల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపే వారు సీటుబెల్ట్ పెట్టు కోవాలని, మద్యం తాగి, అధిక వేగంతో వాహనాలు నడపవద్దని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఈ మధ్య డివిజన్ కేంద్రంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగతనాల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సీఐ: వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసులు ప్రతీరోజు రాత్రి పెట్రోలింగ్‌లు, బీట్లు నిర్వహించి గస్తీ చేపడుతున్నారు. అయితే ప్రజలు తమ ఇళ్లకు తాళం వేసి దూర ప్రాంతాలకు, ఊర్లకు వెళ్లినప్పుడు తమ సిబ్బందికి సమాచారం అందిస్తే అలాంటి ఇళ్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

సీఐ: శాంతి భద్రతలో పరిరక్షణలో భాగంగా ఇదివరకు ఎక్కువ కేసులు నమోదైన వ్యక్తులపై చార్జ్ షీట్స్ తెరుస్తున్నాం. అలాగే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఒకటికంటే ఎక్కువ కేసులు నమోదైన వారిని బైండోవర్ చేయడం, అంతకన్న ఎక్కువ కేసులు ఉన్నవారిపై షీట్స్ తెరవడం అయినా తీరు మార్చుకోకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో మహిళల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సీఐ: సర్కిల్ పరిధిలో మహిళల రక్షణకోసం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు షీ టీంలు ఏర్పాటు చేశాం. ఆపదలో ఉన్న మహిళలకోసం 100డయల్ మరియు వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులో ఉంచాం.

- ఎల్లారెడ్డి టౌన్



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

తస్మాత్ జాగ్రత్త!

❖ రైతులు పురుగుల మందు ప్రభావానికి గురైతే ప్రాథమిక చికిత్స తప్పనిసరి..

పంటచేలకు పురుగుల మందు పిచికారీ చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే విషప్రభావానికి లోనయ్యే ప్రమాదముంటుంది. పురుగుల మందులు తయారయ్యే కర్మాగారాలు, నిల్వ ఉండే గిడ్డంగుల్లో పనిచేసే కార్మికులతో పోలిస్తే, పంట చేలకు పిచికారీ చేసే రైతులపైనే అధిక ప్రభావం పడుతుంది. సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే తక్షణం, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ క్రమంలో మందుల పిచికారీ సందర్భంగా విషప్రభావానికి లోనైన వ్యక్తికి అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి జిల్లా వ్యవసాయాధికారులు వివరించారిలా..

చర్మం ద్వారా..

పంట చేలపై మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై పడితే చర్మం ద్వారా విషపదార్థం లోపలికి చొచ్చుకుపోతుంది. పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా ప్రవేశిస్తుంది.

ముక్కు ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేస్తున్నప్పుడు వెలువడే రసాయనాలు, గాలిలో కలుస్తాయి. ఇవీ ముక్కు ద్వారా నేరుగా శరీరంలోకి ప్రవేశించి హానిచేస్తాయి.

నోటి ద్వారా ..

పురుగుమందులను ముట్టుకున్నప్పుడు లేదా వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి. సబ్బుతో బాగా కడిగాకే ఆహారపానీయాలు తీసుకోవాలి. పైనపైన కడిగి తిన్నప్పుడు పురుగుమందు అవశేషా లు నోటి ద్వారా శరీరంలోపలికి వెళ్తాయి. తద్వారా ఒక్కోసారి మరణం కూడా సంభవిస్తుంది.



ప్రథమ చికిత్స..



చర్మం మీద పురుగుల మందు పడినప్పుడు వెంటనే శుభ్రమైన నీరు, సబ్బుతో పలుమార్లు కడుక్కోవాలి. కంటిలోపడినప్పుడు కూడా జాగ్రత్తగా నీటితో శుభ్రం చేసుకోవాలి. చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. బట్టలపై పడినప్పుడు ఉతికి శుభ్రం చేసిన తర్వాతే ధరించాలి.

● ముక్కు ద్వారా పురుగుల మందు శరీరంలోకి వెళ్లినప్పుడు గాలి ధారాళంగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాసతీసుకోవడం కష్టమైనా, పూర్తిగా ఆగిపోయినా వెంటనే కృత్రిమ శ్వాస ఇవ్వాలి. ఆరోగ్యకరమైన వ్యక్తి ఎవరైనా తన నోటి ద్వారా బాధితుడి నోటిలోకి గాలిని ఊది ఊపిరిపోయొచ్చు. విష ప్రభావానికిలోనైన వ్యక్తిని వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

● నోటి ద్వారా విషం ప్రవేశించినప్పుడు లక్షణాలను బట్టి వెంటనే వాంతి చేయించాలి. గ్లాసు వేడి నీళ్లలో ఒక స్పూను ఉప్పు లేక ఆవాలపొడి కలిపి తాగించాలి. గొంతులో వేళ్లు పెట్టి కక్కించాలి. కడుపులోని పదార్థం ఖాళీ అయ్యే దాకా ఇలా చేస్తూనే ఉండాలి. 8 గ్రాముల చార్‌కోల్, 4 గ్రాముల మెగ్నీషియం ఆక్సైడ్ రసాయనాలను అరగ్లాసు వేడి నీళ్లలో కలిపి తాగించాలి. పాలు, గుడ్డులోని తెల్లసొనా ఇస్తే జీర్ణాశయం లోపలి భాగానికి హాని కలగదు. వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే జీర్ణాశయం, చిన్నపేగులను వీలైనంత శుభ్రం చేసి, చికిత్స అందిస్తారు.

- గాంధారి

రాఖీ పౌర్ణమి విశిష్టత ఏమిటీ?

● ఆధ్యాత్మికం

బాన్సువాడ టౌన్: రక్షాబంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. ఇది అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ. అన్నాచెల్లెలకు, అక్కా తమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ రాఖీ పండుగను జరుపుకుంటారు. అన్నకు గానీ, తమ్ముడికి గానీ ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఓ పట్టిని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. నాకు నీవు రక్ష అంటు సోదరి మణులు సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వచనం తీసుకుంటారు. శ్రీ మహావిష్ణువు బలిచక్రవర్తి కోరిక మేరకు అతడితో పాటు పాతాలంలో ఉండిపోతాడట. అప్పుడు శ్రీమహాలక్ష్మి వెళ్లి బలి చక్రవర్తికి రక్షాబంధనం కట్టి తన భర్తను వైకుంఠానికి తీసుకుని వస్తుందని, అందుకే రక్ష బంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడిందని పురాణాలు తెలుపుతున్నాయి.

Leader Voice

కేసీఆర్ సారూ.. జర మా గోడు వినరూ!

- జి. ప్రవీన్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

లీడర్ వాయిస్



బాన్సువాడ టౌన్: అయ్యా కేసీఆర్ సారూ.. జర మా గోడును వినరాదూ.. మాకు కావాల్సింది చేపపిల్లలు, గొర్రెలు, బర్రెలు కాదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే చిన్న ఉద్యోగం వస్తుందనే ఆశతో ఉన్నాం. మీరేమో కులాల పేరుతో జాదు చేసి జనాలను తృప్తి చేస్తుండ్రు. లక్షలాది మంది విద్యార్థు లు చదువును పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తు ఏమి చేయాలో తోచక హోటళ్లలో, షాపుల్లో, పోలాల్లో పనులు చేసుకుంటుండ్రు. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం అంటివి, గిప్పుడేమో ఊరికో ఉద్యోగం గూడ ఇయ్యకపోతివి సారు. ఇదేనా 1,200 మంది విద్యార్థులు ప్రాణత్యాగాలు చేసి ఇప్పించిన మన బంగారు తెలంగాణలో అడిగిన వారికేమో ఏమి ఇయ్యవు. అడగనోళ్లకేమో వేలకు వేలు జీతాలు అప్పనంగా పెంచుతవు. జర నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకోని ఉద్యోగ అవకాశాలు కల్పించరూ..

అంగన్‌వాడీ భవనాలకు గ్రహణం

- అసంపూర్తిగా నిర్మాణాలు
- అద్దె భవనాల్లో పలు కేంద్రాలు
- అధికారుల నిర్లక్ష్యం



జర దేఖో !!

పిట్లంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

పిట్లం : ప్రభుత్వం అంగన్‌వాడీ సొంత భవనాల నిర్మాణానికి లక్షల రూపాయల నిధులు, స్థలాలను కేటాయించినా అధికారుల నిర్లక్ష్యంతో పనులు సాగడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అద్దె భవనాలలో చిన్నారులకు, గర్భినులు, స్థలం లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పిట్లం మండలంలో 58 అంగన్‌వాడీ సెంటర్‌లు ఉన్నాయి. వాటిలో 15 భవనాలు మాత్రమే సొంతగా ఉండగా, మిగితా 18 సెంటర్‌లు ఆయా పాఠశాలలో 25 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. 2015-16 సం.లో పిట్లం మండలానికి ఎన్‌ఆర్‌ఈజీయస్ నుంచి నిధులు 19 నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కోక్క భవనానికి 8 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించాలని నిదులు 1 కోటి 52 లక్షల రూపాయలు మంజూరుకు ప్రతిపాదనలు సంభందిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు జిల్లా అధికారులకు నివేదికలను పంపించారు. 19 భవనాలు నిర్మించాలనిప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజియస్ నిధులు మంజూరు చేసింది. మండలంలోని మార్దండ, తిమ్మానగర్, పోతురెడ్డిపల్లి, చిన్న కోడప్గల్, గ్రామంలో 4 సెంటర్లు, ధర్మారం 1, రాంపూర్ 1, బండాపల్లి 1, గౌరారం, 1, చిల్లర్గి, గద్దగూడుతండా, నాగంపల్లి తాండ, పిట్లం మండల కేంద్రంలో 5కేంద్రాలు, నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆయా గ్రామాలలో కాంట్రాక్టర్ నిదులు ఉన్నంత వరకే భవనాల పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు.మండల కేంద్రంలో భూమి పూజకే పరిమితమయ్యాయి.మరికొన్ని ఆయా దశలలో పనులు జరిగినాయి. ఇప్పటికైనా సంభందిత శాఖల అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణాల పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.పీఆర్‌ఏఈ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు నిధుల కోరతతో నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు నిలిపివేశామన్నారు.

జిల్లాలో పోలీసుల పనితీరు భేష్: ఎస్పీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

బిచ్కుంద : జిల్లాలో పోలీసుల పనితీరు భేష్‌గా ఉందని జిల్లా ఎస్పి శ్వేతారెడ్డి అన్నారు. గురువారం రోజున బిచ్కుంద సర్కిల్, పోలీస్‌స్టేషన్‌లలో వార్షిక రికార్డులను ఎస్పీ శ్వేత పరిశీలించారు. నమోదైన కేసులు పరిష్కరించని, పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చిన్న జిల్లాల ఏర్పాటైన తర్వాత పోలీసులు ప్రజలకు ఎక్కువ చెరువయ్యారని చాలా వరకు క్రైం రేటు తగ్గడంతో పాటు పేకాట, మట్కా, జూదాన్ని అరికట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కా అమ్మకాలను నిషేదించిన తర్వాత జిల్లాలో పక్కా నిఘాతో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేఖ కార్యాకలాపాలకు ఎవరు పాలుపడిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డీఎస్పీ నర్సింహారావు, బిచ్కుంద సీఐ సర్దార్‌సింగ్, ఎస్‌ఐ నాగరాజు, ఏఎస్‌ఐ మోహాన్, బిచ్కుంద పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో భర్త అరెస్ట్



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌రావు

భిక్కనూరు: మండలకేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో గత నెల 27న రాత్రి జరిగిన వృద్ధురాలి హత్య కేసును భిక్కనూరు పోలీసులు చేదించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సీఐ కోటేశ్వర్‌రావు వెల్లడించారు. గత నెల 27న శ్రీరాంనగర్ కాలనీలో హత్యకు గురైన లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు కాగా వారు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. మృతురాలు లక్ష్మమ్మ మాత్రం భర్త కొమురయ్యతో కలిసి ఎంఈవో కార్యాలయం పక్కన రేకులషెడ్డులో నివాసముంటున్నారు.లక్ష్మమ్మ-కొమురయ్య వారి పెద్ద కుమారుడు రాములుతో గోడవల కారణంగా మాట్లాడటం మానేశారని, ఈ నేపథ్యంలో 27న రాములు ఇంట్లో శుభాకార్యం జరగగా ఆ శుభాకార్యానికి తండ్రి కొమురయ్య హాజరయ్యాడు.దీంతో మృతురాలు లక్ష్మమ్మ కొడుకు రాములు ఇంటికి ఎందుకు వెళ్లినావు అంటూ రాత్రి ఇంటికొచ్చిన తన భర్త కొమురయ్యతో గొడవపడిందని తెలిపారు.ఇద్దరికి మాటమాట పెరగడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న కొమురయ్య కోపంతో లక్ష్మమ్మ తలపై కట్టేతో కొట్టాడు. దింతో లక్ష్మమ్మ అక్కడిక్కడే కుప్పకూలిందని, ఇంతటితో ఆగకుండా లక్ష్మమ్మకు తాడుతో ఉరి వేసి హత్య చేశాడని సీఐ తెలిపారు. అనంతరం ఏమి తెలియనట్టుగా పెద్ద కుమారుడు రాములు దగ్గరికి 28న ఉదయం వెళ్లి అమ్మను ఎవరో చంపేశారని తెలిపాడని, రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయ్యడం జరిగిందన్నారు.కొమురయ్యను విచారించగా తాగిన మైకంలో తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కోమురయ్యను రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

చెరువులోపడి యువకుడి మృతి



రోదిస్తున్న ప్రవీణ్ కుటుంబసభ్యులు

పిట్లం : మండలంలోని రాంపూర్ కలాన్ పంచాయతీ పరిధిలో గల గౌరారం గ్రామంలో ఉర చెరువులో ప్రమాదవశాత్తు యువకుడు పడి మృతి చెందాడు.వివరాలు ఇలా ఉన్నాయి. గౌరారం గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్, దడిగ శ్రీనులు వారి ట్రాక్టర్‌ను కడిగేందుకు చెరువుకు వెళ్లగా ట్రాక్టర్‌ను చెరువులో నీటితో కడిగే సమయంలో చాకలి ప్రవీణ్(21) ప్రమాదవశాత్తు చెరువు నీటిలోకి పోవడంతో మృతి చెందినట్లు సంబంధీకులు తెలిపారు. మరో యువకుడు శ్రీనును సాయిరాంగౌడ్ ప్రాణాలను తెగించి చెరువులో నుంచి ఒడ్డుకు చేర్చాడు. 2 గంటల వరకు ప్రవీణ్ చెరువులో గల్లంతు కావడంతో గ్రామస్థులు గాలింపు చేపట్టి 2 గంటల అనంతరం మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు వి చారణ అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడు..

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామంలో మారాఠి బాల్‌రాజు(67) అనే వృద్ధుడు ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత రాత్రి ఇంటి అవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకోని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఒక్కడే ఇంటిలో ఉండడం వల్ల మానసిన కుంగిపోయి ఊరేసుకోని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూమారుడు లింగం ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అధిక లోడుతో వెళ్తున్న 7 ఇసుక లారీల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లరీలు

బాన్సువాడ : బాన్సువాడ పట్టణం మీదుగా అధిక లోడుతో వెళ్తున్న ఏడు ఇసుక లారీలను పట్టణ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తెల్లవారు జామున తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. కోటగిరి మండలం నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అర్ధరాత్రి తనిఖీలు వే బిల్లులు లేకుండా, డ్రైవర్ లైసెన్సులు లేకుండా, అధిక లోడుతో రవాణా కొనసాగుతుందని 7లారీలను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కామారెడ్డి ఆర్టీవోకు 7 లారీలకు స్వాధీనం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రాజెక్టుల సమాచారం



	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	నీటి చేరిక (క్యూసెక్కుల్లో)	విడుదల (క్యూసెక్కుల్లో)
శ్రీరాంసాగర్	1,091.90	1,055.40	90.31	9.586	0	500
నిజాంసాగర్	1,405.00	1,380.30	17.5	1.352	0	0

పోచమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, హూండీ అపహరణ

బాన్సువాడ: పట్టణ శివారులోని బారడి పోచమ్మ ఆలయంలో గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రశాంత్‌శర్మ గుడిని తెరిచేందుకు వచ్చినపుడు ఆలయ ముఖద్వారం, గేటు, తలుపులు పగులగొట్టి ఉన్నాయని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన సంఘటన వివరాలతో పాటు అపహారణకు గురైన వెండి కిరీటం, హూండీ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆలయ అర్చకులు ప్రశాంత్ శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చోరికి పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు తెలిసింది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిచేయనున్నారు.



బంగారం ధరలు

బిస్కెట్ బంగారం	10 గ్రాములకు	రూ.29,700
ఆర్నమెంట్ బంగారం	10 గ్రాములకు	రూ.29,300
వెండి	10 గ్రాములకు	రూ. 415



సినిమా గైడ్ కామారెడ్డి

ప్రియా70 ఎంఎం	నిన్నుకోరి
ప్రియా 35 ఎంఎం	ఫిదా
శాంతి	బాహుబలి 2
దర్శన్	గౌతమ్‌నంద

ఓడీఎఫ్ మానిటరింగ్ అధికారిగా ఆర్మూర్ కమిషనర్ శైలజ నియామకం

కామారెడ్డిటౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో వ్యక్తిగత మరుగుదొడ్ల పథకం(ఓడీఎఫ్) లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఓడీఎఫ్ మానిటరింగ్ ఇన్‌చార్జీ అధికారిగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపాలిటీ కమిషనర్ శైలజను నియమించారు. పట్టణంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని, లక్ష్యం కోసం ఉన్నతాధికారులు ఆమెను నియమించారు. ఆగస్టు 15లోపు లక్ష్యం పూర్తి కావాలని ఆదేశాలు ఉన్నాయి. అప్పటి వరకు ఓడీఎఫ్ ఇన్‌చార్జీ ఆమెను నియమించడంతో పనులు లక్ష్యం చేరుకునే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం ఆమె ఇన్‌చార్జీ బాధ్యతలను తీసుకోనున్నారు.

ఇంటర్వ్యూ

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత



ఇక్బాల్, బాలుర వసతిగృహ సంక్షేమ అధికారి బీబీపేట

ఆంధ్రజ్యోతి : ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు ఎంత మంది ఉన్నారు?

హెచ్‌డబ్ల్యూవో : హాస్టల్‌లో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8 మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : గత ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం ఎంత?

హెచ్‌డబ్ల్యూవో : గత ఏడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం. అందులో ఎచ్. రవి అనే విద్యార్థికి 9.3 వచ్చింది

ఆంధ్రజ్యోతి : విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హెచ్‌డబ్ల్యూవో : విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం నలుగురు ట్యూటర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాల సెలవు రోజులలో పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : బీబీపేట్ ఎస్సీ హాస్టల్‌లో ఎన్ని సీట్లు ఉన్నాయి?

హెచ్‌డబ్ల్యూవో : బీబీపేట్ ఎస్సీ హాస్టల్‌లో 100 సీట్లకు గాను 32 మంది విద్యార్థులు ఉన్నారు.

లెన్స్ స్టోరీ

బాలికల ఉన్నత పాఠశాలలో అటకెక్కిన కంప్యూటర్ విద్య



మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో కంప్యూటర్లు మూలన పడ్డాయి. వృథాగా మూలన పడి ఉన్న కంప్యూటర్‌లను బాగు చేయించి తమకు కంప్యూటర్‌పై అవగాహన వచ్చేలా చూడాలని పాఠశాల విద్యార్థినులు కోరుతున్నారు. చాలా కాలంగా కంప్యూటర్ బోధించడానికి ఎవరూ లేక కంప్యూటర్‌లు చెడిపోయి పనికి రాకుండా పోతున్నాయని వాటిని వెంటనే బాగు చేయించి కంప్యూటర్ బోధన అందుబాటులోకి తేవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

- దోమకొండ

రోడ్లన్నీ బురదమయం.. నడక నరకప్రాయం

- చెరువులను తలపిస్తున్న వైనం
- సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలంటున్న ప్రజలు



మండలకేంద్రంలోని బీసీ కాలనీ రోడ్డు దుస్థితి ఇదీ..

దోమకొండ : మండలం కేంద్రంలో రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. చిన్న పాటి వర్షాలకు ఏ రోడ్డు చూసినా బురదమయంగా మారి నడవడానికి నరకప్రాయంగా తయారయ్యింది. గ్రామంలో చాలా వరకు ఉన్న ప్రధాన రోడ్లపై ఇప్పటి వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపటకపోవడంతో వర్షం పడితే చాలు రోడ్లని బురదమయం అవుతున్నాయి.బస్టాండ్‌లో సీసీ వెయక గుంతలు ఎక్కువై ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత సంవత్సరం బస్టాండ్ ప్రాగణంలో గుంతల కారణంగా ఓ విద్యార్థి ప్రమాదానికి గురి అయిన విషయం తెలిసిందే. దీని పై సంబందిత శాఖ అధికారులు, పాలకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని అంబారీపేట్ మూల మలుపు వద్ద నుంచి మార్కండేయ ఆలయం వరకు, బీసీ కాలనీలలో ఉండే ప్రధాన దారులలో ఏ ఒక్క దానికి ఇప్పటి వరకు సీసీ రోడ్డు వెయలేదు. చిన్న పాటి వర్షాలకు రోడ్లపై గుంతలలో నీరు నిండి, రోడ్లపై చెత్త చెదారంతో గుంతలలో నీరు నిల్చి బురద రోడ్లుగా మారుతున్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతున్న మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చాలని స్థానికులు ఎన్నిమార్లు మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్లు ఇలా అధ్వాన స్థితిలో ఉన్నపట్టికి గ్రామ పంచాయతీ, మండల అధికారులు, పాలకులు ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ప్రధాన దారులలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.లేదంటే కనీసం నడవడానికి వీలుగానైనా రోడ్డను బాగుచేయించాలని బీసీ కాలనీ వాసులు ప్రజలు కోరుతున్నారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, అర్చనలు





సాయి నాథునికి హారతి ఇస్తున్న పూజారి   ఆలయంలో భక్తుల రద్దీ

కామారెడ్డి కల్చరల్: కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల షిరిడి సాయి మందిరంలో గురువారం సందర్భంగా సాయి నాథునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.అంతేకాక ఈ మాసం శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు.శ్రావణమాసం కావడంతో ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేశారు.మధ్యాహ్నం స్వామివారికి మహా హారతిని సమర్పించి నైవేద్యాన్ని నివేదించి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూమారు 400 మంది భక్తులు పాల్గొన్నారు.సాయంత్రం స్వామివారిని విద్యానగర్ ప్రధాన వీధులగుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం ఆలయంలో భజన కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమయానికి అనుగుణంగా బస్సులను నడిపించాలని ధర్నా

కామారెడ్డిటౌన్: డివిజన్‌లోని ఆయా గ్రామాల నుంచి కామారెడ్డికి చదువుకునేందుకు వచ్చే విద్యార్థుల కోసం విద్యా సంస్థల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఏఐఎస్ఎఫ్, టీజీవీపీల ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డి ఆర్టీసీ డిపో కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. మాచారెడ్డి మండలం సింగరాయిపల్లికి బస్సులు సమయానికి లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సమయానికి రాలేకపోతున్నారని, ఇలా చాలా గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. ఆర్టీసీ సీఐ దినేష్‌తో వాగ్వాదం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

'చదువుతో పాటు మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి'

కామారెడ్డి రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు పాఠశాలల ఆవరణలో, ఇళ్ల వద్ద నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని డీఎఫ్‌వో బాలమణి సూచించారు. గురువారం మండలంలోని పాతరాజంపేట శివారులోని శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో మనకు ఉపయోగపడే చెట్లపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి వాటిని పెద్దగా చేయడం వల్ల కలిగే లాభాలను తెలుసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికి మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతలను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో రేఖాబాను పాల్గొన్నారు.

రెడ్డిపేటలో కేజీవీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఎస్సై

రామారెడ్డి:మండలంలోని రెడ్డిపేట్ గ్రామంలో సింగరాయపల్లి, ఘన్‌పూర్ రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్ తిరుగుతుంటే సీజ్ చేసినట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. సింగరాయపల్లి రోడ్డుపై కేజీవీల్‌ను తిప్పుతుంటే సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేతనాలు పెంచాలని కలెక్టర్‌కు వినతి

కామారెడ్డిటౌన్: జిల్లాలోని మోడల్ స్కూల్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలను పెంచాలని కలెక్టర్ సత్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత 4 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఫిజికల్ డైరెక్టర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, ఆఫీస్ సబ్‌ఆర్డినేట్, నైట్‌వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్ ఫేస్ -3లో 41 మంది బాలకార్మికుల గుర్తింపు

కామారెడ్డి: జిల్లాలో గత నెలలో 1 జూలై 2017 నుంచి 31 జూలై 2017 వరకు జిల్లాలోని మూడు డివిజన్ల స్థాయిలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ఫేస్-3 ఏర్పాటు చేసినట్లు జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి రాదమ్మ తెలిపారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి అదేశానుసారం 41 మంది బాల కార్మికులను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో పది మంది బాల కార్మికులు, 27 మంది వీధుల్లో తిరిగే పిల్లలు మిగత ముగ్గురు బిక్షాటన చేస్తున్న పిల్లలు, ఒకరు అనాథ బాలున్ని గుర్తించడం జరిగిందన్నారు. అనాథ బాలున్ని ప్రభుత్వ వసతి గృహంలో వసతి కల్పించి పాఠశాలకు పంపే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగత వారందరిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పాఠశాలలో చేర్పించే విధంగా తెలియపరిచి అప్పగించడం జరిగిందన్నారు. ఒక్క సారి కౌన్సెలింగ్‌కు హాజరైన తల్లిదండ్రులు వారి పిల్లలను బడి మానిపించిన ఏడల వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

సీఎం మాటలకు నిరసనగా కాంగ్రెస్ నాయకుల నిరసన

కామారెడ్డి: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన మాటలకు నిరసనగా గురువారం కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నేడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నాడంటే కేవలం సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ పుణ్యమేనని గ్రహించాలని అన్నారు. కేసీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించడం అంటే కన్న తల్లిని దుషించినట్లేనని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోయల్‌కర్ కన్నయ్య అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోణే శ్రీనివాస్, తేజాప్ ప్రసాద్, చింతల శ్రీను, వైద్య కిషన్‌రావు, భూపాల్‌రెడ్డి, మెడికల్‌రాజు, విష్ణు, కిషన్, ముదాం రమేష్, జమీల్, లింగాపూర్ ప్రసాద్, రాజిరెడ్డి, శ్యాంరెడ్డి, లింగాపూర్ మాజీ సర్పంచ్ కొమ్మిరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన 'డే' స్కాలర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు

కామారెడ్డి: జిల్లాలో 2017-18 విద్య సంవత్సరంలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు డే స్కాలర్స్, 9,10 తరగతి విద్యార్థులు రాజీవ్ విద్యా దీవెన పథకం కింద ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

'చైనా వస్తువులను బేషరతుగా బహిష్కరిద్దాం'

తాడ్వాయి: చైనా వస్తువులను బేషరతుగా బహిష్కరిద్దామని స్వదేశీజాగరణ మంచ్ ఖండ సహకార్యవర్గ రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని సంతాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చైనా వస్తువుల బహిష్కరణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. చైనా మన దేశంలో వస్తువులను విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటుందని ఆయన తెలిపారు. మన దేశంలో నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తూ డబ్బును సంపాదిస్తూ మన దేశం పైనే దాడి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఖండసహకార్యవర్గ ప్రశాంత్, ఉపాధ్యాయులు దుర్గయ్య, కృష్ణమోహన్, భూమయ్య, ఎస్ఎంసీ చైర్మన్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

'చేపల పెంపకంతో ముదిరాజ్‌లకు ఆర్థికంగా ఎదుగుతారు'

తాడ్వాయి: చేపల పెంపకంతో ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదుగుతారని తాడ్వాయి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుట్ట రమేష్ తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లోని పెద్ద చెరువు, చిన్న చెరువు, మాలకుంటలో గురువారం 15వేల చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో చెరువులో ఐదువేల చొప్పున చేపలను వేసినట్లు ఆయన తెలిపారు. ఈ చేపల పెంపకంతో గ్రామంలోని ముదిరాజ్‌లకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన నుంచి ముఖ్యమంత్రి ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఎల్పుల సాయిలు, సంతోష్, తిరుపతి, భూపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మారి సంవత్సరం కావస్తున్నా పేరు మారని సహకార సంఘం

లింగంపేట : లింగంపేట మండలం నిజామాబాద్ జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాలోకి మారి సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు మండలంలోని నల్లమడుగు సహకార సంఘం బోర్డులో జిల్లా పేరు నిజామాబాద్‌గానే ఉంది. మండలంలోని అధికారుల పనితనానికి నిదర్శనంగా కనిపిస్తోంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా పేరును కామారెడ్డిగా మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బోర్డుపై జిల్లా పేరు మార్చని దృశ్యం

ఇంటర్వ్యూ

మండలంలో 6200ఎకరాల్లో వరి సాగు



సాయిరమేష్, ఏవో లింగంపేట

ఆంధ్రజ్యోతి : మండలంలో వరి ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు?

ఏవో : మండలంలో మొత్తం6600ఎకరాలకు గాను 6200ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి.

ఆంధ్రజ్యోతి : వరి పంటలకు ఎలాంటి తెగులు సోకుతున్నాయి? నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?

ఏవో : వరి పంటలకు ఇప్పటి వరకు మూడు రకాల తెగులు సోకాయి. ఉల్లిపోడ నివారణకు కార్బోసురాన్ గులికలను ఎకరాకు 10కేజీలు వేయాలి, తాటాకు తెగులు నివారణకు లామ్డా, ఫైలో త్రీన్ ఎకరాకు 250ఎమ్ఎల్‌ను వాడాలి, మోగిపురుగు నివారణకు సెట్రా గులికలను ఎకరాకు 4కిలోలు వేయాలి పంటను పరిశీలించి మందులను ఉపయోగించాలి.

ఆంధ్రజ్యోతి : రైతులు అధిక దిగుబడుల కోసం ఎలాంటి పద్ధతులు పాటించాలి ?

ఏవో : రైతులు తమ భూముల్లో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకోవాలి. తగిన మోతాదులో ఎరువులను వాడాలి. పంట మార్పిడి పద్దతులు అవలంభిస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి : వ్యవసాయం లాభదాయకం కోసం రైతులకు మీరిచ్చే సలహాలు ఏమిటీ ?

ఏవో : వ్యవసాయం లాభదాయకంగా ఉండాలంటే శాస్త్రీయ పద్ధతులో సాగు చేయాలి. వాణిజ్య పంటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : తక్కువ నీటి సదుపాయం గల రైతులకు ఎలాంటి సలహాలిస్తారు ?

ఏవో : తక్కువ నీటి సదుపాయం ఉన్న రైతులు మెట్ట పంటలను సాగు చేసుకొని స్పింకర్లు , డ్రిప్ పద్ధతులతో నీరు సరఫరా చేయాలి.

- లింగంపేట

నత్తనడకన గొర్రెల పంపిణీ

- మండలంలో ఇప్పటి వరకు పంపిణీ చేసింది 38యూనిట్లే
- ఆందోళనలో లబ్ధిదారులు

లింగంపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గొల్ల కుర్మల సంక్షేమం కోసం, వారికి ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం మండలంలో నత్తనడకన కొనసాగటంతో లబ్ధిదారులలో ఆందోళన నెలకొంది. మండలంలో ఇప్పటి వరకు మోతెలో 41మంది లబ్ధిదారులకు గాను ఇప్పటి వరకు 38మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం మొదటి విడతలో 569మంది లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వాలని నిచ్చయించారు. ఒక యూనిట్ విలువ 1.25 లక్షలు కాగా ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇవ్వగా 25 శాతం లబ్ధిదారుడు బరించాలి. ఒక యూనిట్‌లో (20 ఆడ గొర్రెలు, ఒక పొటేలు) లింగంపేట, మాచారెడ్డి మండలాలకు కర్నాటక సరిహద్దు జిల్లా బీదర్‌లోని ఉమ్నాబాద్ కేటాయించారు. అక్కడ తగినన్ని జీవాలు అందుబాటు లేక ప్రతీ రోజు 10 నుంచి 20గొర్రెలు కొనుగోలు చేస్తున్నారు. పథకం ప్రారంభానికి ముందు అక్కడ తక్కువ ధరకు లభించే గోర్రెలను, కామారెడ్డి జిల్లానుంచి అధికారులు కొనుగోలుకు వేళ్లటంతో అమ్మకందారులు గొర్రెల ధరలను పెంచేశారు. ముందు 4వేలకు లభించే 1 గొర్రె ధరను రూ. 6వేలకు పెంచారు. 1 పోట్టేలు ధర 8వేల నుంచి 10 వేలు చేశారు. ఆయిన జీవాలు తగినన్ని లభ్యంకాలేదని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆడగొర్రెకు రూ. 5,200లు, పోట్టేలుకు 6వేల నుంచి 7వేల వరకు చేల్లించవచ్చును. అందులో రవణా, బీమా ఖర్చులు కూడా కలిపి చేల్లిస్తారు. పథకం ప్రారంభించి నెలన్నర దాటినా ఇంతవరకు మండలంలో 38యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు. గొర్రెల పంపిణీ జాప్యంపై మండల పశువైద్యాధికారి రవికుమార్‌ను వివరణ కోరగా కర్నాటకలోని బీదర్ ప్రాంతంలో కేటాయించిన సరిపడ గొర్రెలు లభించటంలేదన్నారు. వారం రోజులుగా బీదర్, ఉమ్నాబాద్ ప్రాంతాల్లోనే ఉన్నామని ఆయన తెలిపారు. మోతె గ్రామానికి మరో 5యూనిట్లు పంపిణీ చేస్తే ఒక గ్రామానికి పూర్తివుతుందన్నారు. అక్కడ సరిపడ గొర్రెలు ఉన్న మిగితా తెలంగాణ జిల్లాల లబ్ధిదారులు వెళ్లడంతో డిమాండ్ పెరిగింది. పంపిణీలో జాప్యం నివారించి పంపిణీని వేగవంతం చేయాలని అబ్ధిదారులు కోరుతున్నారు.



ఉమ్నాబాద్‌లో గొర్రెలను కొనుగోలు చేస్తున్న లబ్ధిదారులు

మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించిన ప్రజాప్రతినిధులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

ఎల్లారెడ్డి టౌన్ : పట్టణంలోని పెద్ద చెరువు మినీట్యాంక్ బండ్ నిర్మాణపు పనులను గురువారం ఎంపీపీ నక్క గంగాధర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శఖావత్ అలీ తదితరులు పరిశీలించారు.పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతతో నిర్మాణపు పనులను చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ మోహన మురళికి సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురియకపోవడం పనులకు ఎలాంటి ఆటంకం లేనందున పనులు వేగిరం చేయాలన్నారు.కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

'నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ వేయాలి'

ఎల్లారెడ్డి టౌన్ : నులిపురుగుల నివారణకు ఈనెల 10 నుంచి 19 ఏళ్లలోపు వారందరికి ఆల్బెండజోల్ మాత్రలను వెయ్యాలని మత్తమాల పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య అన్నారు. గురువారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు నులీపురుగుల నివారణ, మీజిల్స్ రుబెల్లా టీకాలపై అవగాహణ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకి సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల లోపు వారందరికి పూర్తి మాత్ర వెయాలని ఆమె సూచించారు. అలాగే ఇదే నెల 17 నుంచి మీజిల్స్ రూబెల్ల వాక్సిన్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ టీకాలు 9 నెలల పసిబిడ్డ నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఈ టీకాలను వెయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో టీకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, హెల్త్ సూపర్ వైజర్లు మధు, చారీ, ప్రధానోపాధ్యాయలు పాల్గోన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు దివ్య

విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు



నూతన బస్సుకు స్వాగతం పలుకుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

నాగిరెడ్డిపేట:మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం గురువారం బాన్సువాడ డీపో ఆర్టీసీ అధికారులు నూతనంగా బస్సు సౌకర్యాన్ని కల్పించారు. మండలంలోని జలాల్‌పూర్, ఆత్మకూర్, మాసానిపల్లి, తాండూర్ గ్రామాల విద్యార్థులు మోడల్ స్కూల్ రాకపోకలకు బస్సు సౌకర్యం లేకుండేది. ఇటీవలే మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని బాన్సువాడ డీపో మెనేజర్ పురుషోత్తంకు వినతిపత్రం అందించడంతో స్పందించి డీపో మెనేజర్ గురువారం నుంచి విద్యార్థుల కోసం ఎల్లారెడ్డి నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డి నుంచి ఉదయం 8 గంటలకు ఈ బస్సు బయలుదేరి జలాల్‌పూర్, ఆత్మకూర్, మాసానిపల్లి, తాండూర్ గ్రామాల మీదుగా మండల కేంద్రానికి 9 గంటల వరకు చేరుకుటుంది. తిరిగి సాయంత్రం 5:20 నిమిషాలకు మండల కేంద్రం నుంచి ఈ గ్రామాల మీదుగానే ఎల్లారెడ్డికి వెళ్తుంది. బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ప్రారంభమైన బస్సుకు మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు బస్సుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ కే.శ్రీనివాస్, వైస్ చైర్మన్ వి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు బాబుజాని, యాదగిరి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు

లింగంపేట : లింగంపేట మండలంలోని మోతె ఉన్నతపాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అంజయ్య గురువారం పాఠశాలలోని 6నుంచి 10వ తరగతి వరకు 130మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ప్లేట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని గమనించి వారికి ప్లేట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుర్యప్రకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వర్షాల కోసం కప్ప కావడీ ఆడుతున్న రైతులు

లింగంపేట : వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వరుణదేవుడు కరుణించకపోవడంతో గురువారం మండల కేంద్రంలో రైతులు కప్ప కప్ప కావడీ అంటూ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కప్పపై నీళ్లు పోసి వరుణ దేవుడిని వేడుకున్నారు.కర్రకు వేపాకులు, కప్పను కట్టి వాటికి పసుపుకుంకుమ పూసి వరుణదేవున్ని ప్రార్థిస్తూ గ్రామంలో తిరిగారు.



వర్షాలు కురువాలని కప్పతల్లి ఆట ఆడుతున్న రైతులు

సీఎం చిత్రపటానికి విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్షీరాభిషేకం


ఎల్లారెడ్డి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా విదుత్‌లను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రెగ్యులరైజ్ చేసేలా నిర్ణయం తీసుకోవడంతో గురువారం పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద సీఎం కేసీఆర్ చిత్ర పటానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు క్షీరాభిషేకం నిర్వహించారు.

ఎస్పీఎంకి తాళం వేసి కార్మికుల సమ్మె

ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కార్మికులు గత 30 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ గురువారం పట్టణంలోని ఎస్పీఎమ్ వద్ద కార్మికులు సమ్మె చేపట్టారు. ఎస్పీఎం గదికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, ఇపీఎఫ్, ఇఎస్ఐ కూడా లేదని తమతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందని ఆవేధన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి ఇటీవల విద్యుత్తు ఆపరేటర్ల 24వేల విలీన ప్రక్రియలో తమకు అవకాశం కల్పించాలన్నారు.

టంగ్ ట్విస్టర్స్

1.There those thousand thinkers were thinking how did the other three thieves go through.
2. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
3.Green glass globes glow greenly.



సూక్తి

నీ సందేహం తీర్చడానికి ఎవరూ లేనప్పుడు నీ అనుభవమే నీకు మార్గదర్శి

చుక్కలు కలపండి



గోల్ఫ్ సాధించాడు



హరియాణాలోని పానిపట్‌కు సమీపంలో 'ఇస్రానా' గ్రామం ఉంటుంది. ఆ గ్రామంలో అడుగుపెడితే.. యువకులంతా కుస్తీపట్లలో మునిగిపోయి ఉంటారు. కానీ ఓ కుర్రాడు మాత్రం గోల్ఫ్ స్టిక్ పట్టుకుని పచ్చిక మైదానంలో సాధన చేస్తుంటాడు. అతడి పేరే 'శుభమ్ జగ్లాన్'. చిన్న గ్రామంలో పుట్టిన ఆ కుర్రాడు, ప్రపంచ గోల్ఫ్ వేదికలపై సత్తా చాటుతున్నాడు. గోల్ఫ్ క్రీడలో దూసుకెళ్తున్న శుభమ్ ఇప్పటికే 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

పానిపట్‌లోని ఇస్రానాలో ఎక్కువమంది రెజ్లింగ్ సాధన చేస్తుంటారు. శుభమ్ జగ్లాన్ కుటుంబ సభ్యుల్లో కూడా రెజ్లింగ్‌లో పట్టు సాధించిన వారున్నారు. కానీ శుభమ్ మనసు మాత్రం మట్టికోర్టు దాటి.. పచ్చిక మైదానం వైపు ఆలోచించింది. గోల్ఫ్ ఆటపై మక్కువ పెంచుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో కపూర్‌సింగ్ అనే ఓ ఎన్‌ఆర్‌ఐ 'ఇస్రానా'లో గోల్ఫ్ అకాడమీని ప్రారంభించాడు. ఐదేళ్ల వయసులో గోల్ఫ్‌ను సాధన చేయడం ప్రారంభించాడు శుభమ్. రోజు రోజుకూ ఆటలో రాటుదేలుతూ జాతీయ, అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీల్లో సత్తా చాటాడు. ఇప్పటి వరకు దాదాపు 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

"ఓ రోజు మా తాతయ్య మా గ్రామంలో కొత్తగా ప్రారంభించిన గోల్ఫ్ అకాడమీకి నన్ను తీసుకు వెళ్లాడు. అకాడమీ యజమాని కపూర్‌సింగ్‌తో నన్ను చేర్చుకోమని చెప్పాడు. అందరిలా నేను కూడా రెజ్లర్‌లా కాకుండా, మరేదైనా సాధించాలనే ఉద్దేశంతోనే ఆయన నన్ను గోల్ఫ్ అకాడమీలో చేర్చాడు. కానీ రెండు నెలల్లోనే ఆ అకాడమీని మూసివేశారు. గోల్ఫ్‌లో నా ప్రతిభను గమనించిన కపూర్ సార్, ఊరి నుంచి తిరిగి వెళ్తూ మా నాన్నతో నన్ను ప్రోత్సహించమని చెప్పారు. దాంతో మా ఇంటి వెనుక ఉన్న కొద్ది స్థలాన్ని నాన్న బాగు చేసి, గోల్ఫ్ మైదానంలా తీర్చిదిద్దారు. ఓ కంప్యూటర్ కొనిచ్చి, యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ, గోల్ఫ్ ఆటను నేర్చుకోమన్నారు. వారాంతాల్లో కర్నాల్ గోల్ఫ్ కోర్సుల వద్దకు నన్ను తీసుకెళ్లేవారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 'ఢిల్లీ గోల్ఫ్ క్లబ్'కు ఓ రోజు ప్రత్యేకించి నన్ను తీసుకు వెళ్లారు నాన్న. దాని వ్యవస్థాపకుడు అమిత్ లుత్రాను కలిసి, నా గురించి వివరించారు. నా ఆటతీరును పరిశీలించిన ఆయన నన్ను వాళ్ల క్లబ్‌లో చేర్చుకున్నారు. అదే నా జీవితంలో మలుపు తీసుకు వచ్చింది. అంతే కాదు నాన్న నన్ను ఢిల్లీలోని 'లక్ష్మణ్ పబ్లిక్ స్కూల్లో' చేర్పించాడు.నా మకాం ఢిల్లీకి మారింది. ఉదయం స్కూల్లో పాఠాలు, సాయంత్రం గోల్ఫ్ క్లబ్‌లో సాధన. కొన్ని సంవత్సరాలుగా ఇదే నా జీవితం. నేను సాధించిన విజయాలు నాన్న కష్టాన్ని మరిపించాయి. అవి నాన్నను ఎంతో సంతోషపెట్టాయి'

- శుభమ్ జగ్లాన్



నవ్వుల్ నవ్వుల్

తల్లి : రవీ! తమ్ముడు ఎందుకు ఏడుస్తున్నాడు రా?
రవి : నేనే కొట్టానమ్మా!
తల్లి : ఎందుకు రా వెధవా!
రవి : నేనేం అడిగినా వాడు జవాబు చెప్పడం లేదు అమ్మా!
తల్లి : తమ్ముడికి ఇంకా మాటలు రాలేదు కదరా!
రవి : మరి ఆ మాట చెప్పొచ్చు కదమ్మా!
తల్లి : !!!!!!!!!!!!!!!!




మీకుతెలుసా?



'బీవర్' అనే జంతువు దంతాలు ఎప్పటికీ పెరుగుతూనే ఉంటాయి.



బొమ్మ గీయండి



ఔనా!



- మనిషి తన జీవిత కాలంలో సుమారు 25 సంవత్సరాలు నిద్రకు కేటాయిస్తాడు.
- అందులో ఆరు సంవత్సరాలు కలలకే సరిపోతాయి. రోజుకు మూడు నుంచి ఏడు కలలొస్తాయట.
- నిద్ర లేచిన నిమిషం లోపే దాదాపు 90 శాతం కలలను మరిచిపోతాం.



శుభమ్ విజేతగా నిలిచిన ప్రధాన టోర్నీలు

మన టీవీకి మంగళం!


నిజామాబాద్ జిల్లాలోని ఓ పాఠశాలలో మూలనపడ్డ టీవీ ఇలా..

- చతుర్విధ ప్రక్రియతో పక్కకు
- గందరగోళంలో విద్యార్థులు
- ఇది సరైన సమయం కాదంటున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్: మనటీవీ ద్వారా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గణిత, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రలలో విషయాలను వివరించేందుకు ప్రభుత్వం మనటీవీ కార్యక్రమాన్ని రూపొందించింది. కానీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చతుర్విద ప్రక్రియతో ప్రభుత్వ పాఠశాలల్లో మనటీవీ ప్రసారాలకు మంగళం పాడినట్లుగా తెలుస్తోంది. జిల్లాలో 284 ఉన్నత పాఠశాలలు ఉండగా ప్రస్తుతం 198 ఉన్నత పాఠశాలల్లో మనటీవీ ప్రసారాలు జరుగుతున్నాయి. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాలలో ప్రతీ రోజు ఒక సబ్జెక్టు నిపుణులతో విద్యార్థులకు టీవీ ద్వారా పాఠాలు బోధిస్తారు. ఉదయం 10.30గంటల నుంచి మొదలుకొని సాయంత్రం వరకు ఒక్కో తరగతికి మన టీవీ ద్వారా షెడ్యూల్ ప్రకారం విషయ బోధన చేస్తారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండేందుకే మనటీవీ ప్రసారాలను ప్రదర్శిస్తున్నారు. మనటీవీ ప్రసారాలు సైతం సక్రమంగా లేవనే విమర్శలు ఉన్నాయి. సిలబస్ కూడా సక్రమంగా లేక విద్యార్థులు గతంలో ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల్లో కనీస వసతులు, కరెంటు లేక మనటీవీ ప్రసారాలు సక్రమంగా జరగలేదు. తాజాగా చతుర్విద ప్రక్రియతో తాత్కాలికంగా మనటీవీ ప్రసారాలను పాఠశాలల్లో నిలిపివేసినట్లుగా తెలుస్తోంది. మనటీవీ షెడ్యూల్, చతుర్విద ప్రక్రియ షెడ్యూల్ విద్యార్థులకు ఒకేసారి నిర్వహించడం కష్టతరం అనే భావనతో తాత్కాలికంగా మనటీవీ ప్రసారాలకు ఉన్నత పాఠశాలల్లో బ్రేక్ వేసినట్లుగా సమాచారం.

మనటీవీ ప్రసారాలు కొనసాగుతున్నాయి..



చతుర్విద ప్రక్రియ వల్ల మనటీవీ ప్రసారాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. జిల్లాలో యథావిధిగా మనటీవీ ప్రసారాలు కొనసాగుతున్నాయి. మనటీవీ ప్రసారాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు.

- నాంపల్లి రాజేష్, డీఈవో, నిజామాబాద్

గందరగోళ పరిస్థితులు..

మనటీవీ ప్రసారాలకుతోడు 1వ తేదీ నుంచి ప్రారంభమైన చతుర్విద బోధన పద్ధతితో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు చతుర్విద ప్రక్రియ ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండునెలలు అయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభించడం వల్ల ఇప్పటికీ పూర్తయిన పాఠ్యాంశాలు మళ్లీ మళ్లీ చెప్పడం ఏమిటని ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. ఎప్పుడో వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన చతుర్విద ప్రక్రియ ఇప్పుడు నిర్వహించడం ద్వారా చదువులో ముందున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సజావుగా సాగుతున్న మనటీవీ ప్రసార పాఠాలను పక్కనపెట్టి చతుర్విద ప్రక్రియ నిర్వహించడం వల్ల విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం ఏమీ లేదని పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

సెలవుల్లో నిర్వహించాల్సింది...

- వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్



1వ తేదీ నుంచి ప్రారంభించిన చతుర్విద ప్రక్రియ వల్ల ప్రస్తుత తరగతులు ఇబ్బందికి గురవుతున్నాయి. చదువులో వెనుకబడిన వారికి ఈ ప్రక్రియ ద్వారా బోధన అభినందించాల్సిందే కానీ వేసవి సెలవుల్లో నిర్వహిస్తే బాగుండేది. ప్రస్తుతం ఫార్మెటీవ్-1 పరీక్షలు ముగిసిన తర్వాత 'సీ'గ్రేడ్ విద్యార్థులకు బోధన చేయడం వల్ల మిగతా విద్యార్థులు ఇబ్బంది పడతారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచించాలి.

అపరిశుభ్రతకు నిలయాలుగా హోటళ్లు!

- శుచీశుభ్రతను మరుస్తున్న నిర్వాహకులు
- ప్రజారోగ్యంపై మున్సిపల్ యంత్రాంగానికి పట్టింపు కరువు

బోధన్‌టౌన్: నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలు అంటూ తేడా లేకుండా హోటళ్లు వెలుస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని పట్టించుకోని హోటల్ నిర్వాహకులు లాభార్జననే ప్రధాన ఎజెండా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. శుచీ, శుభ్రతను మరిచి అపరిశుభ్రత మధ్యే టిఫిన్లు, ఇతర పదార్థాలను అందిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈగల బెడద అధికంగా ఉంటుంది ఈ నేపథ్యంలో తప్పనిసరి శుభ్రతను పాటించాల్సి ఉంటుంది. శుభ్రతను పాటించకపోవడంతో దీని ప్రభావం హోటల్‌కు వచ్చే ప్రజలపై పడుతోంది. అపరిశుభ్రత వాతావరణంలో భుజించడంతో రోగాల బారిన పడే ప్రమాదాలు ఉన్నాయి. ప్రతీ హోటల్ శుభ్రతపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అధికారుల దాడుల జాడ లేకుండా పోతుంది. మచ్చుకైన దాడులు చేయకపోవడంతో హోటల్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శుభ్రత లేదని ఎవరైన ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అధికారులు హోటళ్ల వైపు కన్నెత్తి సైతం చూడకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతుంది. అపరిశుభ్రత మధ్యే టీ, టిఫిన్స్, అల్పాహారం, స్వీట్లు, ఇతర తినుబండరాలను అందిస్తుండటంతో వాటిలో నాణ్యత ప్రమాణాలు కరువవుతున్నాయి. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన మున్సిపల్ యంత్రాంగం కార్యాలయాలకే పరిమితం కావడంతో హోటళ్ల నిర్వాహణ లాభాపేక్షతో ముందుకుసాగుతోంది. ప్రజారోగ్యాన్ని విస్మరించి నిబంధలను ఉల్లఘిస్తున్న హోటళ్లపై దాడులు నిర్వహించి జరిమానలు విధించమో, కేసులు నమోదు చేయడమో చేయాల్సి ఉన్న ఈ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది.

నాణ్యతా ప్రమాణాలు శూన్యం..

ఇక ధరల విషయానికొస్తే నగర కేంద్రాలలో ఉన్న ధరలే పట్టణ కేంద్రాలలో నిర్వాహకులు అమలు చేస్తున్నారు. ధరలకు తగ్గట్టుగా సేవలందించడంలో మాత్రం హోటల్ నిర్వాహకులు విఫలమవుతున్నారు. టిఫిన్ విషయానికి వస్తే నగర కేంద్రంలో 25రూపాయల నుంచి 30రూపాయల వరకు ఉండగా బోధన్ పట్టణంలో సైతం 25రూపాయల నుంచి 30రూపాయల వరకు ఉంది. ఫుల్ టీ 12రూపాయలు, సింగల్ టీ 8రూపాయల ధరలను నిర్ణయించి సామాన్య ప్రజలను ధరలతో బాదుతున్నారు. కేజీ స్వీట్లు 200 రూపాయలపైనే ధరలు ఉన్నాయి. టీ తాగేందుకు వెళ్తే ఈగలు స్వైర విహారం చేస్తున్నాయంటే హోటల్ నిర్వాహకులు ఎంతటి శుభ్రత పాటిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి శుభ్రత పాటించని హోటళ్లపై దాడులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైన ఉంది. లేదంటే అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంతో ప్రజలు రోగాల బారిన ప్రమాదముంది. ఈ విషయమై అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

'తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి'

నవీపేట: ప్రతీ ఒక్కరు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని వీరిని గౌరవిస్తే ప్రపంచం మనల్ని గౌరవిస్తుందని లీడ్ ఇండియా 2020 జిల్లా శిక్షణ కో-ఆర్డినేటర్ రంజిత్ అన్నారు. గురువారం మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థులకు మానవత విలువలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై అవగాహన ముగింపు సమావేశంలో మాట్లాడారు. లీడ్ ఇండియా 2020ఫౌండేషన్‌ను 2003సంవత్సరంలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదుగా ప్రారంభించబడిందన్నారు. నేటి రోజుల్లో వ్యక్తి సమస్యలు దేశ సమస్యలుగా మారుతున్నాయని దేశం అభివృద్ధి చెందాలంటే వ్యక్తి పరిపూర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు శ్రీహరి, హనీష్, శ్రీనివాస్, ఎస్ఎస్ఆర్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ ఇండియా 2020 నిజామాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్

అభివృద్ధి పథకాలపై కలెక్టర్ సమీక్ష

- సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా నిజామాబాద్ జిల్లా అధికారుల్లో కదలిక


సమీక్షలో పాల్గొన్న అధికారులు

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

సీఎం కేసీఆర్ నిజామాబాద్ జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారు కావడంతో జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రధాన పథకాలను సమీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు చేరుకున్న లక్ష్యాలను సమీక్షిస్తున్నారు. సీఎం వచ్చేలోపు అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ యోగితారాణా గురువారం తన ఛాంబర్‌లో ప్రధానమైన పథకాలు ఉపాధిహామీ, మిషన్‌భగీరథ, డబుల్ బెడ్‌రూంలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. పనుల ప్రగతిని తెలుసుకున్నారు. త్వరగా చేయాలని కోరారు. ఉపాధి హామీ ద్వారా అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, షాదీఖానాల నిర్మాణం, సీసీరోడ్లు, కాంపౌండ్‌వాల్స్ నిర్మాణాలను సమీక్షించారు. చివరిదశకు వచ్చిన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. భవన నిర్మాణాలకు ఇప్పటి వరకు మొదలుపెట్టనిచోట సంబంధిత తహసీల్దార్లను దృష్టికి తీసుకువెళ్లి స్థల సేకరణ చేయాలని కోరారు. భవనాలు పూర్తయిన వాటిలో పెయింటింగ్‌లు వేయించాలన్నారు. వివిధ చరిత్రను తెలిపే చిత్రపటాలను వేయాలని కోరారు. అధికారులు పనుల పట్ల అప్రమత్తంగా ఉండి పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్య భవనాలు పూర్తయిన చోట ఆగస్టు 15న ప్రారంభించాలని కోరారు. జిల్లాలో చేపట్టిన మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని ఆమె తెలిపారు. మిగతా పనులను సెప్టెంబరు నెలలోపు పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్‌ల నుంచి గ్రామాలకు వెళ్లే పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంటెక్ వెల్స్ పనులను ఎప్పటికి పూర్తిచేస్తారో చెప్పాలని అధికారులను కోరారు. జిల్లాలో మిషన్‌భగీరథ కింద చేసే పనులను నాణ్యతగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతగా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూంల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారు అయినందున నిర్మాణాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు త్వరగా పనులు చేపట్టాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సమస్య లేదని ఆమె తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. ఈ సమీక్షాసమావేశంలో బోధన్ సబ్‌కలెక్టర్ సిక్తాపట్నాయక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ చక్రవర్తి, ఈఈలు రమేష్, శ్రీనివాస్‌చౌదరి, జలేందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 6



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.



మిథునరాశి:(మే21-జూన్21): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

నలిగిపోతున్న నాలుగో సింహం!

● కామారెడ్డి జిల్లాలో సిబ్బంది లేక పోలీసుల ఇబ్బంది ● జనాభాకు అనుగుణంగా జరగని నియామకం ●అదనపు బాధ్యతలతో అవస్థలు

అపరిశుభ్రంగా పాఠశాల పరిసరాలు



అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

బాన్సువాడ పట్టణంలోని పోలీస్‌లైన్‌లోని బాలికల ఉన్నత పాఠశాల ముందు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కూరగాయల వ్యాపారులు కుల్లిన కూరగాయలను పాఠశాల ముందే పారవేస్తున్నారు. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.పాఠశాల ముందు పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

(-బాన్సువాడ టౌన్)

దుమ్ము లేచిపోద్ది!

● అధ్వానంగా బాన్సువాడ పట్టణ రహదారులు
● అసహనం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు
● కానరాని అధికారుల చర్యలు

జర దేఖో!!



వాహనం వెళ్లడంతో రోడ్డుపై దుమ్ము లేస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్: పట్టణ ప్రధాన రహదారులపై ప్రయాణం చేయాలంటే దుమ్ము లేచిపోద్ది. అవునండోయ్ ఇది అక్షర సత్యం. అసలే ఇరుకు రోడ్లు, ఆపై రోడ్లపై మట్టి పేరుకుపోవడంతో వాహనాలు వచ్చి వెళ్లినప్పుడల్లా దుమ్ము లేచిపోతుంది. బస్సులు, లారీలు, ఇతరాత్ర పెద్దపెద్ద వాహనాల వెనక ప్రయాణం చేయాలంటేనే నరకం తలిపిస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం బాన్సువాడ పట్టణానికి వేలాదిమంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. బస్టాండు నుంచి తాడ్కోల్ రోడ్డు వైపు వెళ్లేదారిలో రోడ్లపైనే మట్టి పేరుకుపోయి ఉంది. దీంతో వాహనాలు వచ్చినప్పుడల్లా దుమ్ము లేస్తూ ప్రయాణికులను ఇబ్బందులపాలు చేస్తుంది. అయినప్పటికీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విచారకరం. నెలల తరబడి ఇలా దుమ్ములో ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోగాలు సైతం వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా రోడ్లపై మురికి, వర్షపు నీటితో ఇబ్బందులు, వర్షం లేనప్పుడేమో రోడ్డుపైన దుమ్ముతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. అసలు బాన్సువాడ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఒకింత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక వ్యాపారస్థుల తిప్పలు వేరే. అసలే రోడ్డువిస్తరణ పనుల్లో స్థలాన్ని కొంతమేర కోల్పోయారు. ఇప్పుడేమో రోడ్డుపై లేస్తున్న దుమ్ముతో మరింత ఇబ్బందులకు లోనవుతున్నారు. రోజు దుకాణాలను తీసి ఊడ్చే సమయంలో విపరీతమైన దుమ్ముపడి ఉంటుందని వాపోతున్నారు. అంతే కాకుండా దుకాణాల్లో ఉన్న వస్తువులపై దుమ్ము పడుతుందని కష్టమర్లు పాత స్టాక్ అంటు కొనుగోలు చేయడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. సంబందితశాఖ అధికారులు స్పందించి వెంటనే బాన్సువాడలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, రోడ్డపై మట్టి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై దుమ్ము దుకాణాల్లోకి వస్తోంది..



రోడ్డుపై గల దుమ్ము వాహనాల రాకపోకలతో నేరుగా దుకాణంలోకే వస్తుంది. దుకాణంలోని వస్తువులపైన దుమ్ము పడుతుంది. వెంట వెంటనే శుభ్రం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

-భాగయ్య, వ్యాపారి

కళ్లు పాడవుతున్నాయి..



బాన్సువాడ ప్రధాన రహదారిలో ద్విచక్రవాహనంపై తిరగాలంటే పుట్టెడు దుఃఖం వస్తుంది. రోడ్డపై మట్టి కారణంగా పెద్ద వాహనాలు వచ్చినప్పుడు విపరీతమైన దుమ్ము లేస్తుంది. ఈ దుమ్ము వెనకాల గల వాహనదారుల కళ్లలో పడుతుంది. అధికారులు వెంటనే రోడ్లపైన మట్టి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

-సందీప్, ప్రయాణికుడు

పుట్టిన శిశువుకు తల్లిపాలే ఎంతో శ్రేయస్కరం

● మండల వైద్యాధికారి దిలీప్‌కుమార్

బీర్కూర్: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం అని మండల వైద్యాధికారి దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు డాక్టర్ దిలీప్‌కుమార్ తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు, బాలింతలకు వివరంగా తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, నీలవేణి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: పట్టణంలోని గౌలిగూడ, అంగడీ బజార్ కాలనీలలో గురువారం ఇంటింటికీ తిరుగుతూ తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు, గర్భిణీలకు అంగన్‌వాడి టీచర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రజ, విజయ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఫిట్స్‌వచ్చి నిండు గర్భిణి మృతి

● మరో 10 రోజుల్లో బిడ్డకు జన్మనివ్వనున్న తరుణంలో జరిగిన ఘటన

బీర్కూర్: 14న బిడ్డకు జన్మనివ్వనున్న ఓ నిండు గర్భిణీ ఫిట్స్ వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందింది. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన నాచ నాగమణి(22) అనే నిండుగర్భిణి గురువారం తెల్లవారు జామున హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందింది. మండల వైద్యాధికారి దిలీప్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ గ్రామానికి చెందిన శ్యామ్, రాధ దంపతుల కుమార్తె నాగమణికి మూడు సంవత్సరాల క్రితం నవీపేట్‌కు చెందిన నాచ గంగికిషన్‌తో వివాహం జరిగింది. కాగా వారు కొన్నిరోజులుగా నిజామాబాద్ పట్టణంలోని గౌతమ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉండగా నాగమణి నిండు గర్భిణీగా ఉండడంతో ఆమె ప్రసవం కోసం ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఆగష్టు 14తేదిన వైద్యులు డెలివరీడేట్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. కాగా బుధవారం నాగమణికి బీపీ ఎక్కువై ఫిట్స్ రావడంతో కుటుంబసభ్యులు బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకవచ్చారు. ఈ మేరకు వైద్యులు దిలీప్‌కుమార్ నాగమణికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. బాన్సువాడ ఏరియా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి నిజామాబాద్‌కు రిఫర్ చేయగా, అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. కుటుంబసభ్యులు నాగమణిని హైదరాబాదులోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. కాగా నాగమణి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని బీర్కూర్‌కు తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



నాగమణి (ఫైల్)

మిషన్ కాకతీయ పనులపై మంత్రికి రైతుల ఫిర్యాదు

పిట్లం: పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో మిషన్ కాకతీయ పథకం కింద మంజూరైన చెరువు పనులు నాణ్యత లోపించి కాంట్రాక్టర్ పనులు చేశారని రాంపూర్ రైతులు, గ్రామ ప్రజలు మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే మిషన్ కాకతీయ ఇరిగేషన్ ఏఈ బాసిత్‌తో మాట్లాడారు. రైతులందరు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేయడంతో మంత్రి మీ అందరికి న్యాయం చేసి, నాణ్యతతో కూడిన పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇరిగేషన్ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెరువు పనులప్పుడు రైతులను ఎందుకు భాగస్వామ్యం చేయలేదని ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేస్తానని మంత్రి హామీతో రైతులు శాంతించారు.

9న సర్వసభ్య సమావేశం

బీర్కూర్: ప్రతీ మూడునెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం ఈ నెల 9న మండలపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ మల్లెల మీనా అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భరత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. మండలస్థాయి అధికారులు తమ తమశాఖల ప్రగతి నివేదికలను వెంట తీసుకురావలని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో రక్షాబంధన్



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

బీర్కూర్: అన్నాచెల్లెల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని తపస్ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో గురువారం బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలోని విద్యార్థిణులు విద్యార్థులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తపస్ నాయకుడు కొత్తపల్లి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతియేటా పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు

● బీర్కూర్ ఎంఈవో నాగేశ్వర్‌రావు

బీర్కూర్: ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని లేనియెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈమేరకు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘం నాయకులు నర్సింలు, శ్రీనివాస్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేయాలి

బిచ్కుంద: భూమిలేని దళితులకు మూడు ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కట్ల భూమన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో బాన్సువాడ డివిజన్‌స్థాయి అఖిల భారత రైతు కూలీ సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన భూమన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పేదప్రజలకు గ్యాస్ సబ్సిడీ ఎత్తివేయడానికి చేస్తున్న ఆలోచనలను మానుకోవాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో దళితులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా తొమ్మిది సరుకులను అందజేయాలని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా కంభాపూర్ రోడ్డు

● కంకరమయంగా ఉన్న రహదారి ● అవస్థలు పడుతున్న ప్రయాణికులు



కంకరతో అధ్వానంగా ఉన్న కంభాపూర్ రహదారి

పిట్లం: మండలంలోని కంభాపూర్ గ్రామానికి బీటీరోడ్డు మంజూరైన మోక్షానికి నోచుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కంభాపూర్ నుంచి గొద్మెగాం వరకు 2కిమీ రహదారి పూర్తిగా కంకర తేలి గుంతలు పడడంతో ప్రభుత్వం బీటీరోడ్డు నిర్మాణానికి 2015-16 సంవత్సరంలో రూ.40 లక్షల నిధులు మంజూరు చేసింది. గత సంవత్సరం భారీ వర్షాలు కురవడంతో కాకి వాగులో ఉధ్ఱతంగాతో పొంగిపొర్లడంతో కంభాపూర్ వంతెన వద్ద రహదారి పూర్తిగా ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు గుంతలను పూడ్చి చేతులెత్తేశారు. బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తే సంబంధిత కాంట్రాక్టర్ రహదారిపై కంకర వేసి అసంపూర్తి పనులు చేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంభాపూర్ గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదని, సరిహద్దు కావడంతో అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామంలో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని తెలిపారు. రహదారిపై కంకర వేసి సంవత్సరం గడుస్తున్నా ఆ కాంట్రాక్టర్ మాత్రం పనులు చేయడం లేదంటున్నారు. ఈ కంకరరోడ్డుపై వెళ్లాలంటే ప్రమాదాలకు గురవుతున్నామని చాలామంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఇక నుంచి ఉపాధి కూలీ బ్యాంకు ఖాతాలో జమ

మద్నూర్: ఉపాధి కూలీలకు బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అంటు గ్రామాల్లో ఎంపీడీవో నాగరాజు అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ మహాత్మ గాంధీ ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్నవారికి గతంలో పోస్టాఫీసుల్లో డబ్బులు జమ చేయబడేవి. ఇకనుంచి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయబడుతాయని అన్నారు. సెప్టెంబర్ నుంచి పోస్టాఫీసు ద్వారా కాకుండా బ్యాంకు ద్వారా ఇస్తామని ప్రతీ ఒక్క కూలీ బ్యాంకులో ఖాతాలు తప్పనిసరిగా తెరవాలని సూచించారు.

మరుగుదొడ్లు నిర్మించుకోండి..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీ డీవో తెలిపారు. మరుగుదొడ్డి నిర్మించుకున్న వారికి రెండు దఫాలుగా 12వేల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఒక్కరికి మరుగుదొడ్డి ఉండాలని సూచించారు. ఎంపీటీసీ సంజయ్, సర్పంచ్ రాంచందర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత భోజనం


శివరాం, వార్డెన్
ఎస్సీ హాస్టల్, పిట్లం

ఆంధ్రజ్యోతి: వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా?

వార్డెన్: వసతి గృహంలోని విద్యార్థులందరికి మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

వార్డెన్: హాస్టల్‌లో 85మంది విద్యార్థులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు మెనూ ప్రకారం అందడం లేదనే ఆరోపణలపై మీ సమాధానం?

వార్డెన్: విద్యార్థులకు రెండు పూటలు భోజనం, ప్రతీ ఆదివారం చికెన్, 6రోజులు గుడ్లు, సాయంత్రం టిఫిన్స్, పండ్లు అందిస్తున్నాం. ఆరోపణలు అవాస్తవం

ఆంధ్రజ్యోతి: పదో తరగత పరీక్షల్లో ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు. ?

వార్డెన్: పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణ సాధించాం,. హాస్టల్‌కు ఉత్తమ అవార్డు రావడం జరిగింది.

లెన్స్ స్టోరీ

అంధకారంలో బస్టాండ్


పిట్లం ప్రయాణ ప్రాంగణం

పిట్లం మండల కేంద్రంలోని బస్టాండ్ అంధకారంలో ఉంటున్న అధికారులు, పాలకులు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్టాండ్ నుంచి ప్రతీరోజు వేలాది సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణం కొనసాగించడానికి జంకుతున్నారు. సాయంత్రం చీకటి పడితే బస్టాండ్ అంతా చీకటి మయంగా మారుతుంది. కనీసం బస్టాండులో కరెంటు సప్లయి ఉన్నప్పటికి ఒక్క బల్బు కూడా అధికారులు ఏర్పాటు చేయక అంధకారంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి బస్టాండులో వెలుగు తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

(-పిట్లం)

సింగూరు జలాల కోసం నిర్వహిస్తున్న

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి!

● నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న కాసుల బాల్‌రాజ్

బీర్కూర్: సింగూరు జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బాన్సువాడ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ కాంగ్రెస్‌శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్ మండలం దామరంచ గ్రామం నుంచి ఈ బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందని, అన్నారం, కిష్టాపూర్, బీర్కూర్ మీదుగా, పొతంగల్, కోటగిరి, రుద్రూరు, వర్ని, నసురుల్లాబాద్ మీదుగా బాన్సువాడ వరకు బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులందరు ఈ బైక్ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు అబ్దుల్ అహ్మద్, పోగు నారాయణ, సానెపు గంగారం, హోటల్ జలీల్, మాజిద్, రావప్ప, వీరేశం, నారంశ్రీను, సాయిలు, ఆరీఫ్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం

● ఎంపీపీ సునంద


వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎంపీపీ

నిజాంసాగర్: శిశువులకు తల్లి పాలే బలం అని ఎంపీపీ సునంద గంగారెడ్డి అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ఈ నెల 1 నుంచి 7వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాలలో బాలింతలతో పాటు గర్భిణీలతో సమావేశం నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో శిశువులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి తల్లి శిశువులకు తల్లిపాలే అందించాలని అన్నారు. ఇటీవల హరితహారం పథకం కింద వందశాతం మొక్కలు నాటించి మండలానికి ఆదర్శంగా నిలిచిన ఆరెపల్లి సర్పంచ్ స్వప్నరవీందర్‌గౌడ్‌లకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందజేసిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సీడీపీవో అనురాధ, ఏపీఎం రాంనారాయణగౌడ్, ఎంపీడీవో రాములునాయక్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సయ్యద్, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు శ్రీలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం మండలంలో..

పిట్లం: పుట్టిన శిశువుకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలని ఐసీడీస్ సూపర్‌వైజర్ కొమురవ్వ అన్నారు. ఆమె గౌరారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఇంటింటికి తిరుగుతు తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. గర్భిణులు వారి ప్రసవాలను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించుకోవాలని, అంగన్‌వాడీ సెంటర్‌లో పంపిణీ చేసే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు మంగమ్మ, మహిళాసంఘం అధ్యక్షులు సాయవ్వ, మహిళలు పాల్గొన్నారు.

పాసుపుస్తకాల్లో భూముల వెరిఫికేషన్

మద్నూర్: రెవెన్యూ రికార్డుల ప్రకారం పహాణికి పాసుబుక్కులలో రైతులకు సంబంధించిన భూములు సరిగ్గా ఉన్నవా లేదా అనే దానిపై వెరిఫికేషన్ చేస్తున్నారు. మండలం లోని మేనూర్ గ్రామంలో తహసీల్దార్ దన్‌వాల్ రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రైతు పాసుబుక్కుల్లో, రెవెన్యూ రికార్డుల్లో సరిగా ఉందా లేదా అని వెరిఫికేషన్ చేస్తున్నారు. త్వరలో రైతులకు తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అయిన తరువాత మీ-సేవా ద్వారానే పాసు బుక్కులు అం దనున్నాయి. వీటన్నింటి దృష్టిలో పెట్టుకుని ఆయా గ్రామాల్లో రైతుల ఇంటికి వెళ్లి భూముల వివరాలు సేకరిస్తున్నారు. ఈ వెరిఫికేషన్ కార్యక్ర మంలో రెవెన్యూ అధికారి హన్మండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ మేమే..


మొక్కను దత్తత తీసుకున్న విద్యార్థినులు

నిజాంసాగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు చెట్లను దత్తత తీసుకుని మొక్కకు రక్షణ మేమేనని నినాదాలు చేశారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలన్నింటిని సంరక్షించి పాఠశాలలో పచ్చదనాన్ని పెంపొందిస్తామని విద్యార్థిని, విద్యార్థులు ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువలోకి మళ్లించిన వృథా నీరు



కాలువలోకి ఉరకలు వేస్తున్న సాగునీరు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి సాగునీరు ఇవ్వరు.. వృథా నీటిని అరికట్టరు.. అనే కథనాన్ని జులై 27న ఆంధ్రజ్యోతిలో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి జిల్లా ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. వృథాగా మంజీరా ఉపనదిలోకి వెళ్తున్న నీటిని జిల్లాస్థాయి ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు నీటిని ప్రధాన కాలువలోకి మళ్లించారు. ప్రధాన కాలువలో సాగునీరు వెళ్తుండడంతో రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. నెల పాటు వృధాగా వెళ్లిన నీటిని అధికారులు ప్రధాన కాలువలోకి మళ్లించకుండా ఆధునీకరణ పనుల కోసం ప్రధాన కాలువలోకి నీరు వెళ్లకుండా అరికట్టి మంజీరా ఉపనదిలోకి విడుదల చేశారు. రైతుల పక్షాన కథనాన్ని అందించిన ఆంధ్రజ్యోతిని జిల్లా రైతాంగం ప్రశంసించారు.

What is Composite Cash Credit?

BANK PO/ CLERKS EXAM SPECIAL

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

1. **Legislative and regulatory changes made over the last 18 months had created an enabling and supportive operational environment for ARCs and for takeover of stressed assets by PE firms/special situation funds. In the abbreviation ARC, the letter A stands for what?**
a) Asset (ARC: Asset Reconstruction Company)
b) Art c) Aspect d) Atlas e) Actpr

2. **As per Foreign Exchange Regulations, NRIs may invest in which of the following, in of an Indian company under Foreign Direct Investment (FDI) Scheme, subject to the terms and conditions specified in Schedule 1?**
a) Company Shares
b) Compulsorily Convertible Preference Shares (CCPS)
c) Compulsorily Convertible Debentures (CCDs)
d) Warrants/ partly paid up shares
e) All the above

3. **The Social Security Scheme namely, AamAadmiBimaYojana (AABY) caters to unorganised sector persons under 48 various vocational groups. Who are such persons / workers?**
a) Beedi Workers b) Brick Kiln Workers,
c) Rickshaw Pullers d) Auto Drivers etc.
e) All the above

4. **What are the benefits available to all the RuPay ATM-cum-debit cardholders?**
a) All RuPay ATM-cum-debit cardholders are presently eligible for accidental death and permanent disability insurance cover.
b) RuPay Classic cardholders are eligible for cover of Rs.1 lakh, whereas RuPay Premium cardholders are eligible for cover of Rs.2 lakh.
c) Insurance premium is paid by the National Payments Corporation of India
d) All the above e) None of these

5. **Supervisory Colleges have been setup for which of the following Scheduled Commercial Banks which have sizeable international presence?**
a) State Bank of India, ICICI Bank Ltd.,
b) Bank of India, Bank of Baroda,
c) Axis Bank Ltd.
d) Punjab National Bank
e) All the above six banks

6. **With which bank Long Term Rural Credit Fund (LTRCF), was created with effect from 2014-15, in order to provide long term refinance to Cooperative banks and RRBs to meet the long term inve stment credit lending in agri-culture, con tributed out of shortfall in achievement of Priority Sector Lending (PSL) targets by Scheduled Commercial Banks?**
NABARD
a) NABARD b) NHB c) LIC
d) HDFC e) ICICI

7. **If any bank branch observes Monday as weekly off, that bank branch shall stay open on Monday, July 31, 2017, as it is the last date for payment of crop insurance premium. In order to facilitate collection of insurance premiums on crops. From whom crop insurance premiums are collected?**
a) Farmers b) Tailors c) Traitors
d) Tutors e) Cheaters

8. **The Monetary Policy Committee (MPC) scheduled to meet on August 1 and 2, 2017 for ________ the Monetary Policy Statement for 2017-18.**
a) Third Bi-monthly b) Fourth bi-monthly
c) Fifth bi-monthly d) Sixth bi-monthly
e) None of these

9. **'Bank charges' printed in the bank pass book, would give details about which of the following?**
a) Nature of the charges - fee/commission/fine/ penalty etc.
b) Reasons for the charges, in brief - e.g. return of cheque (number), commission/ fee on draft issued /remittance (draft number), cheque collection charge (number),
c) Charges for issuance of cheque book, SMS alerts, ATM fees, additional cash withdrawals, etc.
d) All the above e) None of these

10. **'Payment to third parties' printed in the bank pass book, should mention which of the following?**
a) Name of the payee
b) Mode - Transfer, clearing, inter-branch, RTGS/ NEFT, cash, cheque (number)
c) Name of the transferee bank, if the payment is made through clearing/inter-branch transaction/ RTGS/NEFT
d) All the above e) None of these

11. **When Reserve Bank of India (RBI) introduced the system of Primary Dealers (PDs) in the Government Securities (G-Sec) Market?**
a) 1935 b) 1995 c) 1949 d) 1980 e) 1969

12. **What are the objectives of the Primary Dealers (PD) system?**
a) To strengthen the infrastructure in G-Sec market
b) Development of underwriting and market making capabilities for G-Sec
c) Improve secondary market trading system
d) To make PDs an effective conduit for open market operations (OMO)
e) All the above

13. **At all times, at least how much of the paid-up share capital of the private sector banks shall be held by resident Indians?**
a) 49% b) 26 % c) 15% d) 25% e) 30%

14. **From all sources viz., Foreign Direct Investment, Foreign Institutional Investors, Non Resident Indians, foreign investment shall not exceed how much of paid-up capital of the private sector bank?**
a) 51% b) 74 % c) 26% d) 49% e) None

15. **Banks normally issue shares in which method?**
a) Public Issues [(i)Initial Public Offer (ii)Further Public Offer]
b) Private Placement (Preferential Issue / Qualified Institutional Placement)
c) Rights Issue d) Bonus Issues
e) All the above methods

16. **"A loan on which the interest rate is fixed for the entire tenor of the loan" is called as what?**
a) Fixed rate loan b) Bank rate loan
c) Repo rate loan
d) Reverse repo rate loan e) None of these

17. **What is "Floating rate loan"?**
a) A loan on which interest rate does not remain fixed during the tenor of the loan.
b) It is for a boat c) It is for a ship
d) It is for bus e) None of these

18. **What is "Term loan"?**
a) Loan for one day
b) A loan which is repayable after a specified term period
c) Loan for 6 days d) Loan for 10 days
e) None of these

19. **Interest shall be charged on all advances at which period?**
a) Monthly rests b) Half yearly c) Yearly
d) For 5 years e) None of these

20. **From which date all rupee loans sanctioned and credit limits renewed are priced with reference to the Marginal Cost of Funds Based Lending Rate (MCLR) which will be the internal benchmark for such purposes?**
a) w.e.f. April 1, 2016 b) 1.1.2015
c) 2014 d) 2013 e) None of these

21. **The MCLR shall comprise, which of the following?**
a) Marginal cost of funds
b) Negative carry on account of CRR
c) Operating costs d) Tenor premium
e) All the above

22. **What is "Bulk Deposit"?**
a) It means Rupees one crore and above for Scheduled Commercial Banks other than Regional Rural banks
b) Rs. 50 lakhs c) Rs.25 lakhs
d) Rs.10 lakhs e) None of these

23. **What is "Composite Cash Credit?**
a) It is withdrawal
b) It means a type of loan product having a cash credit limit with a fully savings module designed to take care of farmer's interest
c) It is a mortgage d) It is a pledge
e) None of these

24. **What is "Current Account"?**
a) It means a form of non-interest bearing demand deposit where from withdrawals are allowed any number of times depending upon the balance in the account or up to a particular agreed amount. and shall also be deemed to include other deposit accounts which are neither Savings Deposit nor Term Deposit
b) Only for housewives
c) Only for agriculturist
d) Only for teachers e) None of these

25. **What is "Daily product"?**
a) Production of cotton
b) It means the interest applied on the end of day balance
c) Production of milk
d) Production of rice e) None of these

26. **What is "Demand deposit"?**
a) Cash withdrawal
b) It means a deposit received by the bank, which is withdrawable on demand
c) Money payment d) Fixed deposit
e) None of these

27. **What is "Notice deposit"?**
a) Notice period
b) It means term deposit for specific period but withdrawable on giving at least one complete banking day's notice
c) Keys deposit d) Gold deposit
e) None of these

28. **What is "Scheduled commercial Bank"?**
a) Banks other than co-operatives banks included in second schedule of Reserve Bank of India Act, 1934.
b) Banks mentioned in Constitution of India
c) World Bank d) ADB e) None of these

Praturi Potayya Sarma

ANSWERS

1) a	5) e	9) d	14) b	19) a	24) a
2) e	6) a	10) d	15) e	20) a	25) b
3) e	7) a	11) b	16) a	21) e	26) b
4) d	8) a	12) e	17) a	22) a	27) b
		13) b	18) b	23) b	28) a

ఉద్యోగాలు

మిధాని

హైదరాబాద్, కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని) - మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 10
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్/ డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్/ సీనియర్ మేనేజర్(మెల్ట్ ఆపరేషన్స్) 1, సీనియర్ మేనేజర్/ మేనేజర్/ డిప్యూటీ మేనేజర్(మార్కెటింగ్ - రింగ్ ప్రొడక్ట్స్ 1, డై, టూల్ స్టాక్ 1), డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) 2, సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్) 3
వయసు: 45 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అడిషనల్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) పోస్టులకు 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ + ఎంబిఏ లేదా స్పెషలైజేషన్(మెటీరియల్స్ మేనేజ్‌మెంట్/ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్/ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్/ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. పదిహేడేళ్ల అనుభవం ఉండాలి. డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పదమూడేళ్ల అనుభవం ఉండాలి. మిగిలిన పోస్టులన్నింటికీ సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ + నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 16
వెబ్‌సైట్: www.midhani.com

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటీస్‌**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 120
కర్ణాటకలోని ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
గుజరాత్‌లోని ఖాళీలు: 40
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 9, టర్నర్ 3, ఎలక్ట్రీషియన్ 9, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 2, పాసా 9, వెల్డర్ 2, మెషినిస్ట్ 3
అర్హత: పదోతరగతి/ పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ముందుగా www.apprenticeship.gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తరవాత ఎన్‌పిసిఐఎల్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: గుజరాత్ పోస్టులకు ఆగస్టు 16, కర్ణాటక పోస్టులకు ఆగస్టు 24
కర్ణాటక చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kaiga Site, Via Karwar, Po- Kaiga, Uttara Kannada - 581400, Karnataka
గుజరాత్ చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kakrapar Gujarat Site, PO - Anumala, Via -Vyara Dt, Tapi - 394651, Gujarat
వెబ్‌సైట్: www.npcil.nic.in/Opportunities

ఎన్‌హెచ్‌డిసిఎల్

ఎన్‌హెచ్‌డిసి లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 12
పోస్టులు: మెడికల్ ఆఫీసర్ 2, ట్రైనీ ఆఫీసర్(లా 2, కంపెనీ సెక్రటరీ 1, హెచ్‌ఆర్ 3, ఫైనాన్స్ 3), సూపర్‌వైజర్ (సేఫ్టీ) 1
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 8 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
వెబ్‌సైట్: www.nhdcindia.com

సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

1. ఉప్పులో కరిగి ఉన్న మలినాలను తొలగించడానికి ఉపయోగపడేది?
ఎ) $CaCO_3$ బి) NaOH
సి) $Ca(OH)_2$ డి) $2nCO_3$

2. పరిశుద్ధమైన ఉప్పును పొందడానికి ఉప్పు ద్రావణంలోకి ఏ వాయువును పంపుతారు?
ఎ) Cl_2 బి) H_2 సి) HCl డి) N_2

3. బ్రైన్ ద్రావణం అంటే ....
ఎ) HCl ద్రావణం బి) క్లోరిన్ జలం
సి) బ్లీచింగ్ పౌడర్ డి) Nacl జల ద్రావణం

4. దూది, కాగితం, సిల్కు మొదలైన వాటిని విరంజనం చేయడానికి ఉపయోగించేది?
ఎ) SO_2 బి) Cl_2 సి) $CaOCl_2$ డి) $COCl_2$

5. టియర్ గ్యాస్ రసాయన ఫార్ములా?
ఎ) $COCl_2$ బి) $CHCl_3$ సి) $CaOCl_2$ డి) Cl_3CCNO_2

6. ఫాస్‌జీన్ రసాయన నామం?
ఎ) కాల్షియం క్లోరైడ్ బి) కార్బోనైల్ క్లోరైడ్
సి) కార్బన్ మోనాక్సైడ్ డి) ఏదీకాదు

7. తడిసిన రంగు పూలను క్లోరిన్ జాడీలో వేస్తే పూలు రంగును కోల్పోతాయి. దానికి కారణం? కోర్లిన్ ఏవిధంగా పనిచేస్తుంది?
ఎ) క్షయకరణి బి) విరంజనకారి
సి) ఉత్ప్రేరకం డి) ఏదీకాదు

8. ఆకుపచ్చ రంగు గల వాయువు?
ఎ) ఫ్లోరిన్ బి) క్లోరిన్ సి) బ్రోమిన్ డి) అయోడిన్

9. ఎముకల్లో ఉండేది?
ఎ) కాల్షియం ఫాస్ఫేట్ బి) కాల్షియం ఫాస్పైట్
సి) కాల్షియం హైడ్రాక్సైడ్
డి) కాల్షియం హైపో క్లోరేట్

10. ఫాస్ఫారికామ్లాన్ని దేనిలో కలిపి మట్టి పాత్రలో స్వేదనం చెందిస్తే ఫాస్పరస్ లభిస్తుంది?
ఎ) O_2 బి) C సి) H_2 డి) సల్ఫర్

11. ఫాస్పరస్ ఏ వాసనను కలిగి ఉంటుంది?
ఎ) కుళ్లిన కోడిగుడ్డు బి) ఘాటైన
సి) వెల్లుల్లి డి) అమ్మోనియం

12. ఆకాశంలో మెరుపులు ఏర్పడినప్పుడు వాతావరణంలో విడుదలయ్యే వాయువు?
ఎ) O_2 బి) CO_2 సి) N_2O డి) NO

13. గాలిలో నైట్రోజన్ భారశాతం, ఘన పరిమాణాత్మకత శాతాలు?
ఎ) 3/4, 4/5 బి) 1/5, 1/3
సి) 3/2, 4/3 డి) 1/2, 1/3

14. నైట్రోజన్ ఘనీభవన స్థానం?
ఎ) -210.5°C బి) -33°C
సి) 0°C డి) -330°C

15. జింక్, సల్ఫర్‌లను చీకటిలో నెమ్మదిగా వేడి చేసినప్పుడు ఏ రంగు మంట ఇస్తుంది?
ఎ) పసుపు బి) ఆరెంజ్
సి) ఆకుపచ్చ డి) బంగారు రంగు

16. సల్ఫర్ డై ఆక్సైడ్ గాలి కంటే ఎన్ని రెట్లు బరువైనది?
ఎ) 2 1/2 బి) 1 1/2 సి) 1 డి) 2

17. పెట్రోల్ హైడ్రోజనీకరణ ప్రక్రియను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) హేబర్ బి) బెర్జిలియస్
సి) కావెండిష్ డి) డాల్టన్

18. ప్రయోగశాలలో సులువుగా ఆక్సిజన్ తయారు చేయడానికి వాడే రసాయనం?
ఎ) KCl బి) KNO_3 సి) $Kmno_4$ డి) $K_2Cr_2o_7$

19. సోడియం లోహాన్ని ఆక్సిజన్‌తో మండిస్తే ఏర్పడే జ్వాల వర్ణం?
ఎ) ఎరుపు బి) ఆకుపచ్చ సి) నీలం డి) బంగారం

20. జుట్టును విరంజనం చేయడానికి వాడే ద్రవం?
ఎ) $Kmno_4$ బి) H_2O సి) H_2O_2 డి) D_2O

21. ఉప్పునీటి ద్రావణాన్ని ఏమని అంటారు?
ఎ) బ్రైన్ ద్రావణం బి) కఠిన జలం
సి) భారజలం డి) ఏదీకాదు

22. నీటిని విద్యుత్ విశ్లేషణం చేస్తే వెలువడే ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువుల ఘన పరిమాణాల నిష్పత్తి?
ఎ) 1:2 బి) 1:3 సి) 1:1 డి) 2:3

23. కాస్టిక్ సోడా అంటే?
ఎ) సోడియం కార్బోనేట్ బి) సోడియం బైకార్బోనేట్
సి) సోడియం హైడ్రాక్సైడ్ డి) సోడియం క్లోరైడ్

24. లెడ్ పెన్సిల్‌లో ఉండే నల్లని భాగం?
ఎ) లెడ్ బి) గ్రాఫైట్ సి) సీసం డి) జింక్

25. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే లోహం?
ఎ) వెండి బి) బంగారం సి) ప్లాటినం డి) పాదరసం

26. కింది వాటిలో వాయువు కానిది?
ఎ) CO_2 బి) SO_2 సి) O_2 డి) Br_2

27. ఉప్పు, కర్పూరంల మిశ్రమాన్ని ఏ పద్ధతి ద్వారా వేరు చేస్తారు?
ఎ) బాష్పీభవనం బి) ద్రవీభవనం
సి) ఉత్పతనం డి) సంఘననం

28. ఘన పరిమాణాత్మకంగా గాలిలో ఎంత ఆక్సిజన్ ఉంటుంది?
ఎ) ఒకటో వంతు బి) రెండో వంతు
సి) ఐదో వంతు డి) నాలుగో వంతు

29. దుక్క ఇనుము లేదా పోత ఇనుములో కార్బన్ శాతం ఎంత?
ఎ) 3.4% బి) 2.0% సి) 8.0% డి) 1.2%

30. పొటాషియం లాటిన్ పేరు?
ఎ) నేట్రియం బి) కాలియం
సి) భాస్వరం డి) గంధకం

31. రుణ ధృవ కిరణాలను కనిపెట్టింది?
ఎ) జె.జె.థామ్సన్ బి) న్యూటన్
సి) జె.చాడ్విక్ డి) సోమర్‌ఫీల్డ్

32. అత్యధికంగా చొచ్చుకొని పోయే కిరణాలు?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) ఏదీకాదు

33. ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) ఎసిటికామ్లం బి) సిట్రికామ్లం
సి) బోరికామ్లం డి) బెంజొయికామ్లం

34. కింది వాటిలో అత్యంత చల్లబరిచిన పదార్థం?
ఎ) పాదరసం బి) ఐస్‌క్రీం సి) టెప్లాన్ డి) గ్లాస్

35. సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?
ఎ) సున్నపురాయి బి) కాల్షియం
సి) మెగ్నీషియం డి) అల్యూమినియం

36. మరకతం సాధారణ రంగు?
ఎ) పసుపుపచ్చ బి) ముదురు ఆకుపచ్చ
సి) ప్రష్యన్ నీలం డి) ఊదా రంగు

37. రేడియోథెరపీ పద్ధతిలో కోబాల్ట్-60 ఏ కిరణాలను విడుదల చేస్తుంది?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) X - కిరణాలు

38. తెల్ల స్పిరిట్ రసాయన నామం?
ఎ) పెట్రోలియం హైడ్రోకార్బన్‌ల మిశ్రమం
బి) శుభ్రపరచిన ఈథనాల్
సి) సంపూర్ణ ఈథైల్ ఆల్కహాల్
డి) డినేచర్డ్ ఆల్కహాల్

39. భారతదేశంలో ఏ రాష్ట్రం నికోటిన్, పొగాకు కలిగి ఉన్న పదార్థాలను పూర్తిగా నిషేధించింది?
ఎ) హర్యానా బి) ఉత్తరప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. చల్లని నీటితో తీవ్రంగా ప్రతి చర్య జరిపే లోహం ?
ఎ) కాల్షియం బి) సోడియం
సి) మెగ్నీషియం డి) పొటాషియం

41. మానవ మూత్రపిండాల్లోని రాళ్లలో కనిపించే ప్రధానమైన రసాయన సమ్మేళనం?
ఎ) యూరికామ్లం బి) కాల్షియం ఆక్సలేట్
సి) కాల్షియం ఆక్సైడ్ డి) కాల్షియం క్లోరైడ్

42. జాతీయ పోషకాహార సంస్థ ఎక్కడుంది?
ఎ) బెంగళూరు బి) ముంబై
సి) హైదరాబాద్ డి) ఢిల్లీ

43. అంటుకోని వంటపాత్రలను దేనితో పూత పూస్తారు?
ఎ) సిలికాన్ బి) పి.వి.సి సి) గ్రాఫైట్ డి) టెఫ్లాన్

44. కింది వాటిలో సులభంగా లభించని లోహం?
ఎ) రేడియం బి) వెండి సి) స్ట్రాన్షియం డి) పాదరసం

45. సున్నపు నీరు రసాయనిక పేరు?
ఎ) కాల్షియం సల్ఫేట్ బి) కాల్షియం హైడ్రాక్సైడ్
సి) కాల్షియం కార్బోనేట్ డి) కాల్షియం ఆక్సైడ్

46. వేసవి ద్రవం అని ఏ మూలకానికి పేరు?
ఎ) గాలియం బి) థాలియం
సి) రేడియం డి) పోలోనియం

47. పెట్రోల్‌కు ప్రతి విస్ఫోటనకారిగా కలిపే పదార్థం?
ఎ) కార్బన్ మోనాక్సైడ్ బి) టెట్రా ఈథైల్‌లెడ్
సి) ఆల్కహాల్ డి) ఏదీకాదు

48. ఎల్‌పిజి లీకేజిని గుర్తించడానికి కలిపే పదార్థం?
ఎ) మిథైల్ లెడ్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథైల్ మెర్కప్టాన్ డి) క్లోరాల్ హైడ్రేట్

49. కింది వాటిలో అత్యధిక కఠినమైన లోహం?
ఎ) టంగ్‌స్టన్ బి) వెండి సి) ఇత్తడి డి) ఉక్కు

సమాధానాలు

1) సి	8) బి	15) సి	24) బి	33) డి	42) సి
2) బి	9) ఎ	16) ఎ	25) డి	34) డి	43) డి
3) డి	10) బి	17) బి	26) డి	35) డి	44) ఎ
4) సి	11) సి	18) సి	27) సి	36) బి	45) బి
5) డి	12) డి	19) డి	28) సి	37) సి	46) ఎ
6) బి	13) ఎ	20) సి	29) ఎ	38) ఎ	47) బి
7) బి	14) ఎ	21) ఎ	30) బి	39) ఎ	48) సి
		22) సి	31) ఎ	40) బి	49) ఎ
		23) సి	32) సి	41) బి	

ఉద్యోగాలు

టిఎంఆర్‌బి

తమిళనాడు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్- తాత్కాలిక ప్రాతిపదికన కింది విభాగాల్లో **అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 106**

విభాగం: హోమియోపతి **ఖాళీలు:** 4

అర్హత: ఆగస్టు 2 నాటికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా (ఎఫ్.ఎఫ్/ ఎంఎఫ్/ డిఎఫ్ - హోమియోపతి) లేదా వెస్ట్ బెంగాల్‌లోని ప్రముఖ సంస్థల నుంచి డిప్లొమా లేదా హైదరాబాద్‌లోని బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ వారి డిప్లొమా ఇన్ ఇంటిగ్రేటెడ్ మెడిసిన్(హోమియోపతి) లేదా డిగ్రీ + డిప్లొమా లైసెన్స్ సర్టిఫికెట్ (ఆంధ్రా బోర్డ్ ఫర్ ఆయుర్వేద అండ్ హోమియోపతి, హైద్రాబాద్ తదితర సంస్థల నుంచి) లేదా డిప్లొమా(హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ) లేదా బిహెచ్ఎంఎస్/ ఎంబిఎస్ తదితర కోర్సులు పూర్తిచేసి ఉండాలి.

విభాగం: ఆయుర్వేద **ఖాళీలు:** 1

అర్హత: హెచ్‌పిఐఎం(ఆయుర్వేద)/జిసిఐఎం (ఆయుర్వేద) / ఎల్ఐఎం/ బిఎఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.

విభాగం: సిద్ధ **ఖాళీలు:** 101

అర్హత: (హెచ్‌పిఐఎం/ జిసిఐఎం/ ఎండి/ బిఐఎం/ ఎల్ఐఎం)(సిద్ధ) లేదా బిఎస్ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.

వయసు: 35 ఏళ్లలోపుండాలి

ఎంపిక: అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ ద్వారా

అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్: అక్టోబరు 8న

పరీక్ష కేంద్రం: చెన్నై **పరీక్ష ఫీజు:** రూ.750

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22

ఆఫ్‌లైన్ ఫీ పేమెంట్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 24

వెబ్‌సైట్: www.mrb.tn.gov.in

మద్రాస్ ఫెర్టిలైజర్స్

మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ & డిప్లొమా అప్రెంటిస్‌ల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 89

గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటిసెస్‌లు

ఖాళీలు: 6

విభాగాలు - ఖాళీలు: కెమికల్ ఇంజనీరింగ్ 5, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 1 **స్టయిపెండ్:** నెలకు రూ.10,000

అర్హత: బిఇ/ బిటెక్(కెమికల్/ ఎలక్ట్రికల్& ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటీసెస్ ఖాళీలు: 45

విభాగాలు - ఖాళీలు: కెమికల్ 13, మెకానికల్ 20, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 5, సివిల్ 2, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజనీరింగ్ 5

స్టయిపెండ్: నెలకు రూ.9,000

అర్హత: డిప్లొమా(కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ సివిల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్& కంట్రోల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి.

డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్ అప్రెంటిసెస్

ఖాళీలు: 18

స్టయిపెండ్: నెలకు రూ.9,000

అర్హత: డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్

ట్రేడ్ అప్రెంటీస్‌లు **ఖాళీలు:** 20

ట్రేడ్స్ - ఖాళీలు: ఫిట్టర్ 6, టర్నర్ 1, వెల్డర్ 1, ఎలక్ట్రీషియన్ 4, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 4, రిఫ్రిజిరేటర్ & ఎసి మెకానిక్ 1, మెకానిక్ మోటార్ వెహికిల్ 1, మెకానికల్ డీజిల్ 1, డ్రాఫ్ట్‌మన్ మెకానిక్ 1

అర్హత: సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి

స్టయిపెండ్: నెలకు రూ.8630 (డీజిల్ మెకానిక్ ట్రేడ్‌కు మొదటి ఏడాది రూ.7,666) **ట్రైనింగ్:** ఏడాది

అభ్యర్థులు తప్పనిసరిగా www.mhrdnats.gov.in వెబ్‌సైట్లో రిజిస్టరై ఉండాలి. డిగ్రీ/ డిప్లొమా పూర్తిచేసి మూడేళ్లు నిండకూడదు

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 9

దరఖాస్తు హార్డు కాపీ పంపాల్సిన చిరునామా: The General Manager - P&A, Madras Fertilizers Limited, Post Bag No - 2, Manali, Chennai- 600068

వెబ్‌సైట్: www.madrasfert.nic.in

అడ్మిషన్స్

ఎన్‌ఐఇఎల్‌ఐటి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఇఎల్‌ఐటి)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: విఎల్ఎస్ఐ& ఎంబెడెడ్ హార్డ్‌వేర్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్

కోర్సు వ్యవధి: 24 వారాలు

అర్హత: బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ

కోర్సు ప్రారంభం: ఆగస్టు 21

వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

ఎన్ఎల్ఎస్ఐయు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం- కింది కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్), ఏడాది పీజీ డిప్లొమా(హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ చైల్డ్ రైట్స్ లా / కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా & సైబర్ ఫోరెన్సిక్స్)

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: http://ded.nis.ac.in

వరలక్ష్మీ వ్రతంతో సకల శుభాలు

● శ్రావణమాసంలో అత్యధిక మహిళలు ఆచరించే వ్రతం ● కోరిన కోరికలకు కొంగుబంగారం ఈ వ్రతం ● తొర గ్రంధి ప్రత్యేక పూజలు



నిజామాబాద్ కల్చరల్ :

పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే
నారాయణ ప్రియే దేవీ
సుప్రీతా భావసర్వదా..

తామర పువ్వులో జన్మించి సర్వలోకులచే పూజింపబడే నారాయణ ప్రియయైన ఓ మహాలక్ష్మీ అమ్మ ఇవే మా నమస్కారములు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం మహిళా లోకానికి పెద్ద పండుగ. ఈ రోజున వరలక్ష్మీ అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని పండితులు చెప్తుంటారు. స్త్రీలు ఈ రోజున ఉదయాన్నే నిద్రలేచి ఇల్లునంతా శుభ్రపరుచుకొని, ముగ్గులు, తోరణాలను పెట్టి శోభాయమానంగా అలంకరిస్తారు. ధన, ధాన్య, వైద్య, విద్యా, సంతానాది అష్టలక్ష్ములను పూజించిన ఫలితం ఈ ఒక్క వరలక్ష్మీ వ్రతం నాడు అమ్మవారిని పూజించిన పుణ్యం కలుగుతుందని పురాణోక్తి.

భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మీని పూజిస్తే..

ఓం శ్రీ మహాలక్ష్మీదేవి అంటు రెండు చేతులు జోడించి మనసులో ధ్యానించుకొన్నా భక్తులకు కోరిన ఫలాలను ప్రసాదించే తల్లి మహాలక్ష్మీదేవి. అమ్మవారిని ఈరోజున పూజ విధానాల్లో ఇత్తడి, రాగి, వెండి, బంగారు చెంబులో కొబ్బరికాయతో కలశరూపంలో పూజిస్తారు. కొందరు మహిళలు అమ్మవారిని ప్రతిష్ఠించి పాలు, తేనె, నెయ్యి వంటి వాటితో అభిషేకిస్తారు. అమ్మవారు సాక్షాత్తు ఇంట్లో దిగివచ్చి కోలువైందా అన్నట్టుగా అమ్మవారికి చీరలు, రవికలు, పండ్లు, బెల్లం నెయ్యితో తయారు చేసిన నైవేద్యాలతో యదాశక్తిగా పూజిస్తారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహిళలైతే బిందెలకు చీరలను కట్టి పూలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా అమ్మవారిని ప్రతిష్ఠించి మరీ పూజలు జరుపుతారు. భక్తితోపూజిస్తేసకల శుభాలతో పాటు ధనవస్తువాది సమకూరుతాయని నమ్మకం.

తొరగ్రంధి పూజ ప్రత్యేకం..

వరలక్ష్మి వ్రతము రోజున స్త్రీలు తొరగ్రంధి పూజను నిర్వహిస్తారు. ఈ రోజున వ్రతంలో తొరముల పూజ ఒక ప్రత్యేక క్రియ అయి ఉంది. తొమ్మిది ముళ్ళ దారముతో తొరయనే పవిత్రను తయారు చేస్తారు. తొరమునకు ప్రత్యేక పూజలు జరిపి చేతికి కట్టుకుంటారు. తొర గ్రంధిని బట్టి పూజలు నిర్వహించే ఆచారం పూర్వ కాలం నుచి ఉంది. శ్రావణ శుక్లపక్షంలో వ్రతనిష్టలు కట్టుకునే తొరలను నెల కాని, పక్షం, మూడు



రోజులు ఒక రాత్రి పగలుగా నిద్రిస్తారు. తొరలు ధరించడం వల్ల పాపాలు తొలిగిపోతాయని శాస్త్ర వచనం.

వ్రతమును ఈ విధంగా చేస్తారు..

ధన కనక వస్తు వాహనాది సమృద్దులకు మూలము వరలక్ష్మీ దేవి అమ్మ మాకు సౌభాగ్యాన్ని ప్రసాదించు తల్లి అని కొరుకుంటు స్త్రీలు వరలక్ష్మీ పూజలు జరుపుతారు. వరలక్ష్మీ పూజ చేయువారు ఇంటిని శుభ్రం చేసుకొని మామిడి, పూలతో ఇంటిని శోభయానంగా తయారు చేస్తారు. పూజ గ్రహంను రంగవెళ్ళిలతో అలంకరిస్తారు. రంగవెళ్ళిపై పీఠను పెట్టి దానిని అరటి, మామిడి, పూలతో తయారు చేస్తారు. పీఠంపై కొత్త వస్త్రాన్ని దానిపై రాగి చెంబు అందులో నీళ్ల లేదా బియ్యం పోసి బూరు తీయ్యని కొబ్బరి కాయ, ఎర్రవస్త్రంతో కలశస్థాపన చేయాలి. వరలక్ష్మి పూజకు ముందుగా ఇంటి గోత్రం, కుటుంబ సభ్యుల పేర్లతో సంకల్పం చెప్పుకోవాలి. కలశ, గణపతి, గౌరి పూజను నిర్వహిస్తారు. వరాలను ప్రసాదించే తల్లి వరలక్ష్మి నమోస్తుతే అంటు వరలక్ష్మి దేవిని ఆహ్వానిస్తారు. కలశం, ప్రతిమ రూపంలో అమ్మను ఆరాధిస్తారు. అమ్మ మహాత్యాన్ని తెలిపే కథలు బ్రహ్మణుని ద్వారా వింటారు. అమ్మకు భక్తితో కలువ, ఎరుపు రంగు పూలు, ఎరుపు అక్షింతలతో అష్టోత్తర శత నామాలతో పూజిస్తారు. వరలక్ష్మి పూజను నియమ నిష్టలతో పూజలు నిర్వహించి తొరగ్రంధికి ప్రత్యేక పూజలు జరుపుతారు. అమ్మకు ఇష్టమైన బెల్లంతో తయారు చేసిన నైవేద్యాలను నివేధిస్తారు. లక్ష్మిదేవిని స్మరిస్తు ముత్తాయిదువులకు పూలు పండ్లు ఆకులతో పసుపు బొట్టులను అందజేస్తారు.

శోభాయమానంగా దేవాలయాలు..

శ్రావణమాస రెండవ శుక్రవారమైన

సందర్భం

వరలక్ష్మీ వ్రతం పుర్కరించుకొని జిల్లాలోని మహాలక్ష్మీ దేవాలయాలు శోభాయమానంగా మారాయి. నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ, బోధన్ తదితర దేవాలయాలలో వరలక్ష్మీ వ్రతంకు సిద్దమయ్యారు. ఆ దేవాలయాల కమిటీలు ఆలయాలకు మామిడి తోరణాలు, కొబ్బరి అరటి వంటి వాటిలో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

హరితహారంలో కామారెడ్డి జిల్లా ద్వితీయస్థానం : పోచారం

పిట్లం : ముఖ్యమంత్రి కెసీఆర్ మన రాష్ట్రంలో ఏరాష్ట్రంలో లేని విధంగా హరితహారంలో మొక్కలు నాటడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పిట్లం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో హరితహారం 3వ విడతలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన విలేఖరుల సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 18కోట్ల 16లక్షల మొక్కలు నాటడం జరిగిందని, రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా ప్రథమస్థానంలో ఉందని, కామారెడ్డి జిల్లా ద్వితీయస్థానంలో మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్థి చేయడం జరిగిందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు కాళేశ్వరం నుండి కోట్లాది రూ.ల వ్యయంతో కాలువలను త్రవ్వడం జరుగుతుందని, రాబోయే రోజులలో కాళేశ్వరం నీరు నిజాంసాగర్‌కు రావడం జరుగుతుందన్నారు. హరితహారంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటినిసంరక్షించే దిశగా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిట్లం మార్కెట్ కమిటి ఆవరణలో షాది ముబారక్ పథకం కింద లబ్దిదారులకు మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పి చైర్మెన్ దఫేధార్‌రాజు, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే లబ్దిదారులకు షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మెన్ దఫేదార్ రాజు, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, ఎంపీపీ రజినికాంత్‌రెడ్డి, జెడ్పిటిసి ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, తెరాస పార్టీ మండల అద్యక్షుడు వాసరి రమేష్, ఎంపీటీసీలు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అద్యక్షులు జగదీశ్, ఆర్డీవొ రాజేశ్వర్, తెరాస పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

పిట్లం : మండలంలోని రాంపూర్, కుర్తి గ్రామ సరిహద్దుల్లో నూతనంగా నిర్మించిన 33/11కె.వి విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం నాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి విచ్చేసిన మంత్రి విలేఖరులతో మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 24 గంటల విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కెసీఆర్ పనిచేస్తున్నారన్నారు. రైతులకు వ్యవసాయానికి తెలంగాణ ప్రభుత్వంలో 12 గంటల కరెంటును అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందిస్తామని ఆయన అన్నారు. రాంపూర్‌లో అర్ఈటిపియస్ఐ నిధుల నుండి కోటి రూ.ల వ్యయంతో 33/11కె.వి విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో కుర్తి, రాంపూర్, గౌరారం, గౌరారం తాండ ప్రజలకు కరెంటు సమస్య ఉండదని అన్నారు. అనంతరం సబ్‌స్టేషన్ ఆవరణలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మెన్ దఫేదార్ రాజు, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, ఎంపీపీ రజినికాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, తెరాస పార్టీ మండల అద్యక్షుడు వాసరి రమేష్, సర్పంచ్‌లు బాలమణి, రాజమణి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కామారెడ్డిగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి మున్సిపల్‌ను స్వచ్ఛ కామారెడ్డిగా తీర్చిదిద్దాలని, ఇందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సానిటేషన్ జవాన్‌లు, కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరైమాట్లాడారు. చెత్త రహిత ప్రాంతాలుగా అన్ని రోడ్లను గుర్తించాలని అన్నారు. రోడ్లపై చెత్తను వేసే వ్యాపారులకు, యజమానులపై అవసరమైతే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆగష్టు 15లోపు అన్ని వార్డులో చెత్త సేకరణ అటోలు, ట్రాక్టర్ల సమస్యను తీర్చాలని అధికారులకు సూచించారు.

గ్రామ సంఘాల పని తీరును పరిశీలించిన బీహార్ బృందం

దోమకొండ : మండలంలోని వివిధ గ్రామాలలో మహిళ సమాఖ్య అధికారుల ఆద్వర్యంలో గ్రామలలో పలు గ్రామ సంఘాల పని తీరును బీహర్ నుండి వచ్చిన తోమ్మిది మంది సభ్యుల టీం సందర్శించారు. ఈ సందర్బంగా వారు దోమకొండ, ముత్యంపేట్ గ్రామలలో గ్రామ సంఘాల పని తీరును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో గల ఎన్‌డీసీసీ బ్యాంక్‌ను సందర్శించారు. అనంతరం దోమకొండ మండల కేంద్రంలో గల మహిళ సమాఖ్య భవనంలో ఎర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ సంఘాలలో బుక్ కీపింగ్, పుస్తకాల నిర్వహన, ఎస్‌ఎచ్‌వోల పనీతీరు, వీవోలు, ఎమ్ఎస్‌ల పనీతీరుపై వారికి వివరించినట్టు ఎపీఎం పప్పుల రవీందర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీహర్ టీం సభ్యులు ప్రమోద్ మోహర్, సంతీలాల్ కుమార్, చంద్రవీర్ కుమార్, రధదేవి, భవితదేవి, అనిత సహని, ప్రతికదేవి, ప్రీతి కుమారి, ఎపీఎమ్ఎఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, మదుమూర్తి, వినోధ, రాందాస్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.